


# చైతన్యరథం




సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


**నెలలో రెండుసార్లైనా ఆర్థిక కమిటీలు భేటీ కావాలి**
స్పీకర్ అయ్యన్న పాత్రుడు 10

**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి**
స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి 11

# ఎన్డీయే గెలుపు

# రాష్ట్ర పునర్నిర్మాణానికి సంజీవని



- టీడీపీ, జనసేన, బీజేపీ శాశ్వతంగా ఐక్యంగా ఉండాలి
- మూడు పార్టీలు సమష్టిగా ఉంటే మరో పార్టీకి అవకాశం రాదు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి.. ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదు
- వైసీపీతో లాలూచీ నేతలను కూటమి దగ్గరకు రానివ్వొద్దు
- కార్యకర్తలు, పార్టీ కోసం పని చేయని వాళ్లు మనకొద్దు
- గోదావరి వృధాజలాలు బనకచర్లకు తీసుకెళ్తుంటే అభ్యంతరం తగదు
- కాళేశ్వరం నిర్మాణానికి ఏపీ అభ్యంతరం చెప్పలేదు...
- రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలనేదే నా కల
- తెలుగుజాతి కోసం పుట్టిన పార్టీ టీడీపీ...

2



- తెలుగు ప్రజలెక్కడున్నా వారికోసం పార్టీ పనిచేస్తుంది
- పట్టభద్రుల ఎమ్మెల్సీల విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు
- ఆలపాటి, పేరాబత్తుల ఘనవిజయంపై కూటమి నేతలు, కార్యకర్తలకు అభినందన

## అమర్‌నాథ్, దళిత డ్రైవర్ హత్యలపై చర్చకు సిద్ధమా?

- బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారు?
- కార్పొరేషన్లకు ఎందుకు నిధులివ్వలేదు?
- అబద్ధాలు చెప్పి పారిపోవడం సరికాదు
- వైసీపీ సభ్యులు సమాధానం చెప్పాలి
- మండలిలో బొత్స వ్యాఖ్యలకు లోకేష్ కౌంటర్

5



## ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా.. గెలుపు కూటమిదే!

- 9 నెలల్లో అధికారం.. 9 నెలల్లో సంక్షేమం..
- అభివృద్ధి చేసి చూపించడం టీడీపీకే సాధ్యం
- ఎమ్మెల్సీల ఘన విజయం ఒక చరిత్ర
- అపూర్వ విజయాన్నిచ్చిన గ్రాడ్యుయేట్లకు ధన్యవాదాలు
- ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపే ధైర్యం వైసీపీకి లేదు
- ఐటీ మంత్రి లోకేష్ భావోద్వేగ ప్రసంగం
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు

4



## పారదర్శకంగానే వీసీల నియామకం

- మండలిలో వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి లోకేష్
- బెదిరించారనే పదం ఎక్కడుందో చూపించాలని సవాల్
- ఆరోపణలపై నిగ్గు తేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలి
- వైసీపీ హయాంలో విద్యాశాఖను ఏటీఎమ్‌గా వాడారని ధ్వజం

5



## ఈ నెల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్

- వైసీపీ హయాంలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు
- టీడీపీ పాలనలోనే 70 శాతం ఉపాధ్యాయ నియామకాలు
- వర్గీకరణపై త్వరలోనే వన్‌మ్యాన్ కమిషన్ నివేదిక
- మండలిలో సభ్యుల ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం

5

## మహిళల భద్రతకు 'శక్తి యాప్'



- మహిళా దినోత్సవాన సీఎం చేతులమీదుగా ప్రారంభం
- వైసీపీ పాలనలో ప్రచారానికి మాత్రమే దిశ పరిమితం
- ఎంతమందిని కాపాడారో చెప్పాలి?
- మండలిలో వైసీపీ సభ్యులకు హోంమంత్రి అనిత కౌంటర్

7



## మూడేళ్లలో భూముల రీ సర్వే పూర్తి

- ప్రస్తుతం మండలానికో గ్రామంలో ప్రాజెక్ట్
- గత ప్రభుత్వంలో తప్పులతడక, ప్రచార ఆర్భాటం
- 2.79 లక్షల ఫిర్యాదుల్లో 90 శాతం పరిష్కారం
- అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

8

## ఇన్వెస్ట్‌మెంట్స్ హబ్‌గా ఏపీ

- పోర్టుల అభివృద్ధికి లాజిస్టిక్స్ కీలకం
- 2030నాటికి మారిటైం గేట్‌వేగా భారత్
- పెట్టుబడుల మంత్రి బిసి జనార్దన్ రెడ్డి స్పష్టీకరణ
- విజయవాడలో 'మారిటైం' సదస్సుకు హాజరు

11



చిన్నాన్నపై గొడ్డలివేటు వేయించి...

## 'నారాసుర రక్తచరిత్ర' అన్న వారే మారీచులు!

- సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు మళ్లించి పేదలకు ద్రోహం చేశారు
- నా ఎస్సీ ఎస్టీలంటూ మొసలి కన్నీళ్లు కార్చారు.. చెప్పేదొకటి చేసేదొకటికి జిరాక్స్ కాదా?
- వర్ల్దెల్లి మురళి అబద్ధాల కుతంత్రం -14

6

# ఎన్డీయే గెలుపు

# రాష్ట్ర పునర్‌నిర్మాణానికి సంజీవని

- టీడీపీ, జనసేన, బీజేపీ శాశ్వతంగా ఐక్యంగా ఉండాలి
- మూడు పార్టీలు సమిష్టిగావుంటే మరో పార్టీకి అవకాశం రాదు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి..
- ఎవ్వరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదు
- వైసీపీతో లాలూచీ నేతలను కూటమి దగ్గరకు రానివ్వొద్దు
- కార్యకర్తలు, పార్టీ కోసం పని చేయని వాళ్లు మనకొద్దు
- గోదావరి వృధాజలాలు బనకచర్లకు తీసుకెళ్తుంటే అభ్యంతరం తగదు
- కాళేశ్వరం నిర్మాణానికి ఏపీ అభ్యంతరం చెప్పలేదు...
- రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలనేదే నా కల
- తెలుగుజాతి కోసం పుట్టిన పార్టీ టీడీపీ...
- తెలుగు ప్రజలెక్కడున్నా వారికోసం పార్టీ పనిచేస్తుంది
- పట్టభద్రుల ఎమ్మెల్సీల విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు
- ఆలపాటి, పేరాబత్తుల ఘనవిజయంపై కూటమి నేతలు, కార్యకర్తలకు అభినందన



అమరావతి (చైతన్య రథం): 'ఎన్డీయే గెలుపు రాష్ట్ర పునర్‌నిర్మాణానికి సంజీవని' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని అన్నారు. మూడు పార్టీల నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఐకమత్యంతో మెలగాలని, ఒకరినొకరు గౌరవించుకునే సాంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని కార్యకర్తలను కోరారు. మూడు పార్టీలు ప్రజల్లోవుంటే భవిష్యత్తులో ఏ పార్టీ అధికారంలోకి రావడానికి అవకాశం ఉండదని, శాశ్వతంగా ఎన్డీయేనే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా- గుంటూరు, ఉమ్మడి తూర్పు -పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావోద్వేగంగా మాట్లాడారు.

## భారీ మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్సీలకు అభినందనలు

ఎన్డీయే తరపున విజయం సాధించిన ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తులు రాజశేఖరాన్ని అభినందిస్తున్నా. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో, 93 శాతం స్ట్రైక్‌రైట్‌తో గెలిచాం. ఇప్పుడు పోటీ చేసిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఘన విజయం సాధించాం. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన శ్రీనివాసులుకు రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చాం. 2023లో జరిగిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గెలిచాం. ప్రజలకు మనపైవున్న విశ్వాసంతో గెలిపించారు. పనిచేసే వారినే ప్రజలు గెలిపిస్తారు. పొత్తులో భాగంగా తెనాలి సీటును నాదెండ్ల మనోహర్ కేటాయిస్తున్నామని చెప్పగానే ఆలపాటి రాజేంద్ర ఎదురు మాట్లాడకుండా సహకరించారు. నాదెండ్ల మనోహర్ కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడి భారీ మెజారిటీ తీసుకొచ్చి మాట నిలబెట్టుకున్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చాం.





## ఐక్యంగా పనిచేస్తే కూటమికి తిరుగుండదు

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కలిసి పనిచేస్తే కూటమికి తిరుగు ఉండదు. అధికారంలోకి వచ్చాక విజయం కోసం పనిచేసిన వారిని విస్మరించకూడదు. కలిసి పనిచేసినప్పుడే ఫలితాలు ఘనంగా ఉంటాయి. 2024 ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలందరికీ ఒకే పిలుపిచ్చాం... రాష్ట్రాన్ని పునర్‌నిర్మించాల్సిన అవసరం ఉంది. కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత తీసుకోండని కోరాం. వందకువంద శాతం పని చేశారు. రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిశాం, కూటమి విజయానికి పనిచేయాలని జన సైనికులను పవన్ కళ్యాణ్ కోరితే వారు కూడా బ్రహ్మాండంగా పని చేశారు. పురంధేశ్వరి పిలుపుతో బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేశారు. ఆ ఎన్నికల్లో సమైక్యంగా పనిచేసి విజయం సాధించాం.

## మూడుముక్కలాటతో సర్వనాశనం చేశారు

రాజధాని అమరావతిని స్మశానం అన్నారు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాటలాడి అభివృద్ధి చేయకుండా సర్వనాశనం చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు ప్రపంచబ్యాంకు ద్వారా అందించింది. మేం 72 శాతం పనులు పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. 2019లో మళ్లీ మన ప్రభుత్వం వచ్చివుంటే 2020కి పోలవరం పూర్తయ్యేది. కానీ గత ప్రభుత్వం చేతకానితనంవల్ల డయాఫ్రంవాల్ కొట్టుకుపోయింది. విచ్ఛిన్నమైన ప్రాజెక్టును చూసి బాధపడ్డ మొదటి వ్యక్తిని నేను. పండుగపూట కూడా కేంద్రమంత్రిని కలిసి ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని ఒత్తిడి తెచ్చాను. ఇటీవల కేంద్రం ముందుకొచ్చి రూ.12,150 కోట్లు కేటాయించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సహకారం ఇచ్చింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ మళ్లీ రాదనుకున్నారు. ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి, కార్మికశాఖ మంత్రితో ఒకటే చెప్పాను. స్టీల్‌ప్లాంట్ ఏపీ సెంటిమెంట్. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదంతో ప్రాజెక్టు కోసం ప్రాణత్యాగం చేశారని, నిర్లక్ష్యం చేయొద్దని కోరా. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం రూ.11,400 కోట్లు కేటాయించింది. విశాఖ రైల్వే జోన్ వస్తుందని ఎవరూ ఊహించలేదు. రైల్వేజోన్‌కు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. రాష్ట్రానికి 6.5 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం. తద్వారా 5 లక్షల ఉద్యోగాలు వస్తాయి.

## ప్రజలు మనల్ని నమ్మితే వదిలిపెట్టరు

ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఆలోచించాలి. మీరు శాశ్వతంగా ప్రజాప్రతినిధులుగా ఉండటం మీ చేతుల్లో ఉంది. వన్‌టైం ప్రతినిధిలుగా ఉండాలనుకుంటే మీ ఇష్టం. సాధారణంగా ప్రధాన పార్టీలు పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసేవి కాదు. స్వతంత్రులు నిలబడేవారు. కానీ రాయలసీమ పశ్చిమతో ప్రారంభించి ఐదు స్థానాలు గెలిచేదాకా వచ్చాం. ఏ వ్యక్తైనా రాజకీయాల్లో ప్రజలకు మంచి చేస్తే, మనం ఉన్నామని నమ్మితే ప్రజలు వదిలిపెట్టరు. కుప్పంలో నేను ఎనిమిదిసార్లు గెలిచాను. ప్రజలకు అందుబాటులో ఉండి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే నిత్యం గెలుస్తాం. మనపై చాలా బాధ్యతలున్నాయి. నాల్గవసారి సీఎం అయ్యా. గత పాలకుల విధ్వంసంతో అన్ని విధాలా దోపిడీకీ గురైన రాష్ట్ర పరిస్థితి తలుచుకుంటే నిద్ర పట్టడం లేదు. ప్రజలకు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చాం. ఖజానా చూస్తే దిక్కుతోచడం లేదు. క్లిష్టమైన పరిస్థితులు వచ్చినప్పుడు ఎన్డీయే అనునిత్యం ఆలోచిస్తోంది. అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే రూ.4 వేలు పింఛన్ ఇచ్చాం. అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశాం. త్వరలోనే తల్లికి వందనం కింద రూ.15 వేలు, అన్నదాత కింద కేంద్రం ఇచ్చేవి కలుపుకుని రూ.20 వేలు, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఇస్తాం. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చదువుకున్న వాళ్లు మనల్ని గెలిపించారు. గత ఎన్నికల్లో 57శాతం ఓట్లు వస్తే ఇప్పుడు 63 శాతానికి ఓటు శాతం పెరిగింది. ప్రజల్లో మరింత నమ్మకం పెరిగింది. పట్టభద్రులకు కూటమి తరపున ధన్యవాదాలు తెలుపుతున్నా.

## 9 నెలల్లోనే తలసరి ఆదాయం పెరిగింది

డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే అభివృద్ధి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రం కోసం పని చేస్తాయి. కేంద్రంలో ఏ చిన్న ఇబ్బంది ఉన్నా వెంటనే పరిష్కరించుకుని ముందుకెళ్లే సాంప్రదాయానికి శ్రీకారం చుట్టాం. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ కీలక పాత్ర పోషించబోతోంది, నాలెడ్జ్ ఎకానమిలో యువత, ఉద్యోగులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరముంది. 2047నాటికి దేశంలో

- (మిగతా వివరాలు 3లో)

# ఎన్డీయే గెలుపు
# రాష్ట్ర పునర్నిర్మాణానికి సంజీవని





(2వ పేజీ తరువాయి)

నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ ఉండాలనేది నా ఆకాంక్ష. 9 నెలల్లోనే 12.9 వృద్ధిరేటు సాధించాం. దీనిద్వారా తలసరి ఆదాయం పెరిగింది. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే లక్ష్యంగా ఎన్డీయే ముందుకెళ్తుంది. ఆదాయం ఉంటే చాలదు ఆరోగ్యం, ఆనందం ఉండాలి. ఇవన్నీ ఉండాలంటే దానికి తగ్గ వేదిక ఉండాలి. సమాజంలో పేదరికం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఆర్థిక అసమానతలు లేకుండా చేస్తామని మాటిస్తున్నా.

## లాలూచీ పడి వైసీపీ నేతలకు పనులు చేయొద్దు

కొందరు టీడీపీ, కూటమి నేతలు వైసీపీకి పని చేస్తున్నారు. మీరు చేయాల్సింది... ఎన్డీయే నేతలకు, కార్యకర్తలకు. రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తాం. ప్రజలందరికీ అభివృద్ధి చేస్తాం. కార్పొరేషన్ చైర్మన్లు, ట్రస్ట్ బోర్డుల్లో ఎన్డీయే నాయకులుంటారు. ఆ గౌరవం ఎన్డీయే నాయకులకే దక్కాలి. వైసీపీతో లాలూచీపడే నాయకులకు చెప్తున్నాం. మొన్న ఈ మాట చెప్పినందుకు వైసీపీ నేతలు గింజుకుంటున్నారు. వైసీపీ నేతలు లంచాలిచ్చి అవినీతి పనులు చేసుకోవాలని చూస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలి. మీ ఆటలు సాగనివ్వను. మళ్లీ చెప్తున్నా, సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ ఇస్తాం. దబాయించాలని చూస్తే పగటి కలలే మిగులుతాయి. గత పాలకులు రాజకీయాలను కలుషితం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలు, ఘోరాలు చేశారు. తప్పు చేసిన వారిపట్ల చట్టం తన పని తాను చేసుకుపోతుంది.

## వృధా జలాలు బనకచర్లకు తరలిస్తే అభ్యంతరం చెప్పొద్దు

తెలుగుజాతికి విజ్ఞప్తి చేస్తున్నా. తెలంగాణ ప్రజలను కూడా కోరుతున్నా. పోలవరం నీళ్లు బనజకచర్లకు తీసుకెళ్తాం. సముద్రంలోకి పోయే వృథానీటిని సీమకు తీసుకెళ్తామంటే అభ్యంతరం చెప్పొద్దు. తెలుగుదేశం పార్టీ తెలుగుజాతి కోసం పెట్టిన పార్టీ. నాడు, నేడు తెలుగుజాతి కోసమే పనిచేస్తాం. రాష్ట్ర విభజన సమయంలోనూ రెండు ప్రాంతాలు సమానమని, రెండుకళ్లని, సమన్యాయం చేయమని అడిగాను. రెండుచోట్లా నమ్మారు. తెలంగాణలో 20 స్థానాలిచ్చారు. ఇక్కడ అధికారమిచ్చారు. సముద్రంలోకి వెళ్లే నీటిని తీసుకెళ్తామంటే హక్కు లేదంటున్నారు. తెలంగాణలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును నేను ఎక్కడా, ఎప్పుడూ వ్యతిరేకించలేదు, స్వాగతించాను. గోదావరిపై ప్రాజెక్టులు కట్టి నీళ్లు తీసుకోమని చెప్పా. గోదావరి తెలుగువారికి శ్రీరామ రక్ష. ఏటా వెయ్యి టీఎంసీ నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. రాజకీయ నేతలు పాజిటివ్‌గా ఆలోచించాలి.

తెలుగుజాతి ప్రయోజనాలే... నా ప్రయోజనాలు

మోదీ దేశాన్ని నడిపిస్తే... తెలుగుజాతిని అగ్రజాతిగా చేయాలన్నది నా కోరిక. 45 ఏళ్లుగా నన్ను తెలుగు ప్రజలు ఆరాధించారు. జాతి ప్రయోజనాలే నా ప్రయోజనాలు. తెలంగాణ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నా, కరువు ప్రాంతానికి నీళ్లు తీసుకెళ్తే బాధపడొద్దు. అవకాశముంటే మీరు మరిన్ని నీళ్లు తీసుకోండి.. మిగిలిన నీళ్లే మేం వాడుకుంటాం. గోదావరి నీళ్లు రాజమండ్రి దాటితే సముద్రంలోకి వెళ్తాయి తప్ప ఎవరూ వినియోగించుకోలేరు. తెలంగాణలో పడే వర్షాలతో నీళ్లు నిలబెట్టుకోలేకపోవడంతో నీరొచ్చి పడి విజయవాడ మునిగింది. పోలవరం నీళ్లు బనకచర్లకు తీసుకెళ్తే తెలంగాణ ప్రజలు కూడా 20నుంచి 30 టీఎంసీ ద్వాకా వాడుకోవచ్చు. ఏపీలో ఉన్నా, తెలంగాణలో ఉన్నా, ఏ రాష్ట్రంలో ఉన్నా తెలుగు ప్రజల కోసమే తెలుగుదేశం పార్టీ పని చేస్తుంది’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.











చైతన్యరథం

## ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా

# గెలుపు కూటమిదే!

- 9 నెలల్లో అధికారం.. 9 నెలల్లో సంక్షేమం..
- అభివృద్ధి చేసి చూపించడం టీడీపీకే సాధ్యం
- ఎమ్మెల్సీల ఘన విజయం ఒక చరిత్ర
- అపూర్వ విజయాన్నిచ్చిన గ్రాడ్యుయేట్లకు ధన్యవాదాలు
- ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపే ధైర్యం వైసీపీకి లేదు
- ఐటీ మంత్రి లోకేష్ భావోద్వేగ ప్రసంగం
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు



అమరావతి (చైతన్య రథం): ఈవీఎం అయినా.. బ్యాలెట్ అయినా గెలుపు కూటమిదేనని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘన విజయం నేపథ్యంలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో మంత్రి పాల్గొన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 9 నెలల్లో అధికారంలోకి రావడమైనా, 9 నెలల్లో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించినా ఒక్క టీడీపీకే సాధ్యమన్నారు. 9 నెలల్లో పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత విశ్వ విఖ్యాత స్వర్గీయ నందమూరి తారకరామారావుదైతే, 9 నెలల్లో రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన ఘనత మన చంద్రన్నదన్నారు. వేదికపై పెద్దలకు నమస్కరించి ఉపన్యాసం ప్రారంభించిన లోకేష్ 'ఈ విజయం ఒక చరిత్ర. పార్టీ ఆవిర్భావం తర్వాత మొదటిసారి ఐదుకు ఐదూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలను టీడీపీ కైవసం చేసుకుంది. గౌరవాధ్యక్షులతో చర్చించినప్పుడు గెలుపు కాదు.. భారీ మెజార్టీతో గెలిస్తేనే అదొక గెలుపని ఆనాడు చెప్పారు. కృష్ణా -గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా 82వేల ఓట్ల మెజార్టీతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలిచారు. తూర్పు -పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా 77,500 ఓట్ల భారీ మెజారిటీతో రాజశేఖర్ విజయం సాధించారు. కౌన్సిల్‌లో పులుల్లా మన ఎమ్మెల్సీలు పనిచేస్తున్నారు. మరో ఇద్దరు నాయకులు కౌన్సిల్‌కు రాబోతుండటం ఆనందంగా ఉంది. ఇంతటి విజయాన్ని అందించిన గ్రాడ్యుయేట్లకు, గెలుపు కోసం పనిచేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జోనల్ కోఆర్డినేటర్లు, ప్రత్యేకంగా ప్రాణ సమానమైన కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు' అన్నారు.

### అభ్యర్థిని నిలిపే ధైర్యం వైసీపీకి లేదు

'ప్రజలు కొట్టిన దెబ్బకి పులివెందుల ఎమ్మెల్యే ఇంకా కోలుకోలేదు. ఆయనకు కొత్త పేరు పెట్టా. ఆయన ఒకరోజు ఎమ్మెల్యే. అసెంబ్లీ సమావేశాలు పెడితే ఒక్కరోజు మాత్రమే వస్తారు. ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వకపోయినా.. అసెంబ్లీకి ఒకరోజు వచ్చి ప్రతిపక్ష హోదా కావాలని అడిగి బెంగుళూరు పారిపోతారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని పోటీకి పెడితే డిపాజిట్ రాదని వాళ్లకు తెలుసు. అందుకే అభ్యర్థిని నిలిపే దమ్ము, ధైర్యం లేక వెనక్కివెళ్లారు. 2023లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు గుర్తున్నాయా? అప్పుడు జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు గేమ్‌ఛేంజర్‌గా మారాయి. ఆ ఎన్నికలతో రాష్ట్ర ముఖ చిత్రం మారిపోయింది. పార్టీ ఆవిర్భావం తర్వాత మొదటిసారి 8 నెలల ముందే మనం అభ్యర్థులను ప్రకటించుకున్నాం. పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా రామ్ గోపాల్‌రెడ్డి,తూర్పురాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా శ్రీకాంత్ కంచర్ల,ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవి రావు ఆ రోజు ఘన విజయం సాధించారు. ఆ ఎన్నికల దెబ్బకే వైసీపీకి దిమ్మ తిరిగింది. ఆ రోజు నుంచే సీన్ రివర్స్ అయింది. కట్ చేస్తే 164 సీట్లతో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఓ వైపు మోడీ మేనియా, మరోవైపు బాబు బ్రాండ్, ఇంకోవైపు నాకు అన్న సమానులైన పవనన్న పవర్ దెబ్బకు వైకాపాకు దిమ్మతిరిగి దుకాణం బందైంది' అంటూ మంత్రి లోకేష్ ఉద్వేగంగా మాట్లాడారు.

### దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది టీడీపీ

అసలు దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్. వైసీపీ ఐదేళ్లలో చేయని సంక్షేమం మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 9 నెలల్లో చేసి చూపించాం. చాలీచాలని రూ.200 పెన్షన్ ను ఐదురెట్లు చేసి వెయ్యి రూపాయలకు పెంచిన ఘనత చంద్రబాబు గారిది. వెయ్యిని రూ. 2000 చేసింది కూడా చంద్రబాబు గారే. ఇప్పుడు రూ.3000 పెన్షన్ ను రూ.4000 చేసిన ఘనత మన నాయకుడు చంద్రబాబు గారిది. దివ్యాంగుల పెన్షన్ రూ.3000 నుండి రూ.6000 చేశారు. పూర్తిగా మంచానికి పరిమితం అయిన వారికి ప్రతినెల రూ.15,000 పెన్షన్ ఇస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెన్షన్ ఇవ్వడం లేదు. 198 అన్నా క్యాంటిన్లు తిరిగి ప్రారంభించాం. దీపం పథకం కింద ఇప్పటికే కోటి సిలిండర్లు ఉచితంగా ఇచ్చాం. వచ్చే మే లో ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇవ్వబోతున్నాం. చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇవ్వబోతున్నాం. మే లో అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తాం.

### ఈ గెలుపు యువతది

20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం అని దేశంలో ఏ పార్టీ చేయని విధంగా మ్యానిఫెస్టోలో పెట్టిన దమ్మున్న పార్టీ టీడీపీ. ఈ గ్రాడ్యుయేట్ గెలుపు యువతది. మాపై బాధ్యత పెంచారు. పద్ధతి ప్రకారం డీఎస్సీ నిర్వహిస్తాం, జాబ్ కేలండర్ కూడా విడుదల చేస్తాం. ఈ నెలలోనే 16,347 టీచర్ పోస్టులు కల్పిస్తూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తున్నాం. రూ.6,78,345కోట్ల పెట్టుబడులు, 4,28,705 ఉద్యోగాలు రాబోతున్నాయి. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్, ఎన్ హెచ్పీసీ, ఏపీ జెన్ కో, బీసీసీఎల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, టీసీఎస్, ఎస్ఏఈఎల్ సోలార్, టాటా పవర్.. ఇలా అనేక కంపెనీలు వస్తున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న ఎన్నో చెత్త నిర్ణయాల వలన ప్రజలు ఇబ్బందులు పడ్డారు వాటిని రద్దు చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. చెత్త పన్ను, మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశాం.

### విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నాం

కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. అమరావతి పనులు ఈ నెలలో ప్రారంభిస్తున్నాం. కేంద్రం రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం అందించింది. పోలవరం పనులు ప్రారంభం అయ్యాయి. నిర్వాసితులకు వెయ్యి కోట్లు మన ప్రభుత్వం అందజేసింది. కేంద్రం రూ.12,157 వేల కోట్ల ఆర్థిక సాయం అందించింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకున్నాం. కేంద్రం రూ.13 వేల కోట్ల సాయం అందించింది. విశాఖ రైల్వే జోన్ కూడా మనం సాధించుకున్నాం. రోడ్లపై గుంతలు కూడా పూడ్చిన ఘనత మన ప్రభుత్వానిది.

### ఈ నెలలోనే అన్ని పదవుల భర్తీ

దేశంలో ఏ పార్టీకి లేని బలం మనకు ఉంది. కార్యకర్తలే టీడీపీకి బలం, బలగం. మంచి చేస్తే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు. ఎవరైనా చెడు చేస్తే చీల్చి చెండాడతారు. ఒక పద్ధతి ప్రకారం నామినేటెడ్ పదవులు అన్ని భర్తీ చేస్తున్నాం. గౌరవ జాతీయ అధ్యక్షుల వారి ఆదేశాల మేరకు ఈ నెలలోనే అన్ని పదవులు భర్తీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. దేశంలో ఏ పార్టీ చేయని విధంగా కోటి సభ్యత్వాలతో రికార్డులు బద్దలుకొట్టాం. కార్యకర్తల ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచాం. నేను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత కార్యకర్తల సంక్షేమం కోసం దాదాపు రూ.130 కోట్లు ఖర్చుచేశాం.

### చట్టాన్ని ఉల్లంఘించిన వారెవరినీ వదిలిపెట్టం

ఈ రోజు నేను ఎక్కడికి వెళ్లినా రెడ్ బుక్ గురించి అడుగుతున్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ వెళ్తోంది. చట్టాన్ని ఉల్లంఘించి కార్యకర్తలు, ప్రజల్ని ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టం. ఆ ప్రక్రియ ప్రారంభం అయింది. అంతేగాని ఎవరినో వదిలిపెడతామనే అనుమానాలు వద్దు. ఈ విజయానికి సహకరించిన బీజేపీ కార్యకర్తలకు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అహర్నిశలు నాతో కోఆర్డినేట్ చేయడంతో పాటు గ్రామస్థాయి నుంచి కలిసికట్టుగా పనిచేసిన జనసైనికులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.





చైతన్యరథం

# పారదర్శకంగానే వీసీల నియామకం

- మండలిలో వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి లోకేష్
- బెదిరించారనే పదం ఎక్కడుందో చూపించాలని చాలెంజ్
- ఆరోపణలపై నిగ్గు తేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలి
- వారి హయాంలో విద్యాశాఖను ఏటీఎమ్‌గా వాడారని ధ్వజం

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా వీసీల నియామకం చేపట్టామని, బెదిరించారనే పదం ఎక్కడుందో చూపించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సవాల్ చేశారు. వీసీల రాజీనామా అంశంలో వైసీపీ సభ్యుల ఆరోపణలపై శాసనమండలిలో మంత్రి సమాధానం ఇచ్చారు. 15 మంది వీసీలను బలవంతంగా రాజీనామా చేయించారన్న అంశంపై విచారణ జరిపించాలని మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, వైసీపీ సభ్యులు కోరగా దీనిపై లోకేష్ స్పందించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను తిప్పి కొట్టారు. మొత్తం 17 మంది రాజీనామా చేస్తే 10 మంది పర్సనల్, నో రీజన్స్‌తో రాజీనామా చేశారు. అందుకు సంబంధించిన లేఖలు తన వద్ద ఉన్నాయని సమాధానమిచ్చారు. ఇద్దరు ప్రభుత్వానికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలని రాజీనామా చేసినట్లు ఇచ్చారు. ఐదుగురు ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ వచ్చాయి.. అందుకే రాజీనామా చేశామని చెప్పారు. బెదిరించారు..పలానా వ్యక్తులు ఫోన్ చేశారు. నిరసనగా బయటకు వెళ్లమన్నారు.. అందుకే రాజీనామా చేశారని ఎవరూ చెప్పలేదని తెలిపారు.

## వైసీపీ ఆరోపణలపై నిగ్గు తేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలి

గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆర్జీయూకేలో రామచంద్రరాజు ఈ విధంగానే రాజీనామా చేశారు. రాయలసీమ యూనివర్సిటీకి సంబంధించిన ప్రసాదరావు, కృష్ణదేవరాయ యూనివర్సిటీకి సంబంధించి రెహ్మాతుల్లా, ద్రవిడ యూనివర్సిటీకి సంబంధించి సుధాకర్, వెంకటేశ్వర యూనివర్సిటీకి సంబంధించి రాజేంద్రప్రసాద్ కూడా ఈ విధంగానే



రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా సమర్పిస్తాను. 21-07-2019న ద్రవిడయన్ యూనివర్సిటీ వీసీ విషయంలో వైసీపీ నేతలు ఏ విధంగా వ్యవహరించారో మనం చూశాం. ఇలా చాలా ఆధారాలు ఉన్నాయి. దీనిపై ప్రివిలేజ్ మోషన్ పాస్ చేయాలనుకున్నాం. దీనిని సీరియస్‌గా తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు.

## బెదిరించారనే పదం ఎక్కడుందో చూపించాలి

బెదిరించాం.. భయపెట్టించాం.. అందుకే రాజీనామాలు చేశారని వైసీపీ సభ్యులు మాట్లాడారు. వారిచ్చిన రాజీనామా లేఖలో ఎక్కడా బెదిరించారని, భయపెట్టారని లేదు. కొత్త టీంకు అవకాశమివ్వాలని ఒకరిద్దరు కోరారు.ప్రసాద్‌రెడ్డికి ఏ అర్హతతో ఇచ్చారు. యూనివర్సిటీలో సీఎం పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారా? కూటమి ప్రభుత్వంలో వీసీ నియామకాలను పారదర్శకంగా చేశాం. కేజీ నుంచి పీజీ వరకు సంస్కరణలు తీసుకు వస్తున్నాం.

వైసీపీ హయాంలో 117 జీవో తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలల నుంచి 12 లక్షల మంది విద్యార్థులను దూరం చేశారు. చిక్కీ టెండర్లలో 36 శాతం రేట్లు తగ్గించాం. స్కూల్ కిట్స్ లో 10 శాతం, గుడ్ల ధరలు తగ్గించాం. వీటన్నింటిపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

## వైసీపీ హయాంలో విద్యాశాఖను ఏటీఎంగా వాడారు

గతంలో విద్యాశాఖను ఏ విధంగా ఏటీఎంగా వాడారో చర్చిద్దాం. దయజేసి దీనిపై చర్చకు అనుమతించి రికార్డులు తెప్పించాలి. బెదిరించాం అనే పదం వాడారు. ఆ లేఖల్లో ఎక్కడా బెదిరించారని లేదు. ప్రివిలేజ్ మోషన్‌కు అనుమతించాలని కోరారు. గవర్నర్ రాజీనామాలను ఆమోదిస్తే ఆయననే ప్రశ్నిస్తున్నారు. వైసీపీ హయాంలో ఇంగ్లీషు రాని వారిని వీసీలుగా నియమించారు. రాజారెడ్డి చెల్లెలి కోడలిని వీసీగా నియమించారు. మాది ప్రజాస్వామ్య ప్రభుత్వం. పరదాలు కట్టుకుని తిరగాల్సిన అవసరం లేదని  లోకేష్ ఘాటుగా సమాధానమిచ్చారు.

# మార్చిలోనే డీఎస్సీ నోటిఫికేషన్

- వర్గీకరణపై త్వరలోనే వన్‌మ్యాన్ కమిషన్ నివేదిక
- వైసీపీ హయాంలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు
- టీడీపీ పాలనలోనే 70 శాతం ఉపాధ్యాయ నియామకాలు
- మండలిలో సభ్యుల ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం

అమరావతి(చైతన్యరథం): ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానమి చ్చారు. నిరుద్యోగ యువకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వారందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి



కూడా డీఎస్సీ నిర్వహించలేదు. ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు. దీనిపై వైసీపీ సమాధానం చెప్పాలి. ఉపాధ్యాయ నియామకాల్లో 1994 నుంచి చూస్తే 2,60,194 పోస్టులు భర్తీ చేశారు. అందులో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 1,80,272 పోస్టులు భర్తీ చేశాం. ఒక్క టీడీపీ హయాంలోనే 70 శాతం టీచర్ పోస్టులు భర్తీ అయ్యాయి. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేయడం జరిగింది. అందులో భాగంగానే గత సంవత్సరం జూలై 2న టెట్ నిర్వహించాం. 4.27లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 3.68లక్షల మంది పరీక్షకు హాజరు కాగా 1.87లక్షల మంది అర్హత సాధించారు. సెప్టెంబర్ 3 నుంచి సెప్టెంబర్ 21 వరకు టెట్ పరీక్ష ను పూర్తిచేయడం జరిగింది. వర్గీకరణపై వన్‌మ్యాన్ కమిషన్ నివేదిక త్వరలోనే రాబోతుందని భావిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేబాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని నిరుద్యోగ యువతకు ఈ సభ సాక్షిగా హామీ ఇస్తున్నా. ప్రతిపక్ష పార్టీ నేతలు తన శాఖకు సంబంధించి ప్రశ్నలు వేసి చర్చించేందుకు సిద్ధంగా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

# దళితులకు మేనమామ అని.. దగా చేశావ్

- వారి సంక్షేమంపై మాట్లాడే హక్కు మీకు లేదు
- తమ ప్రభుత్వంలో మెరుగైన సౌకర్యాలు
- రూ.143 కోట్లతో వసతిగృహాల్లో మరమ్మతులు
- మండలిలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

అమరావతి(చైతన్యరథం): దళితులకు మేనమామ అంటూ జగన్‌రెడ్డి దగా చేశారని మండలిలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. దళితుల సంక్షేమంపై మాట్లాడే హక్కు వారికి లేదని వ్యాఖ్యానించారు.



చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.143కోట్లతో వసతిగృహాల్లో మరమ్మతులు చేయిస్తున్నా మని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల్లో మరమ్మతులకు గత ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.27కోట్లు మాత్ర మేనని గుర్తుచేశారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరులో 210 మంది విద్యార్థులున్న హాస్టల్‌లో వైసీపీ అసమర్థత వల్ల 30మందికి పడిపోయిందని తెలిపారు. దానిని రూ.30లక్షలతో మరమ్మతులు చేసి ఆధునీకరించినట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని సంక్షేమ వసతిగృహాల్లో బీపీటీ బియ్యంతో విద్యార్థులకు భోజనం పెడతామని వివరించారు. పోస్టుమెట్రిక్ విద్యార్థులకు చరిత్రలో మొదటిసారి కార్పెట్ బెడ్ షీట్లు, టవళ్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య, భోజనం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

# అమర్‌నాథ్, దళిత డ్రైవర్ హత్యపై చర్చకు సిద్ధమా?

- బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారు?
- కార్పోరేషన్లకు ఎందుకు నిధులివ్వలేదు?
- అబద్ధాలు చెప్పి పారిపోవడం సరికాదు
- వైసీపీ సభ్యులు సమాధానం చెప్పాలి
- మండలిలో  బొత్స వ్యాఖ్యలకు లోకేష్ కౌంటర్



అమరావతి(చైతన్యరథం): వైసీపీ హయాంలో బీసీ విద్యార్థి అమర్‌నాథ్ గౌడ్, దళిత డ్రైవర్ హత్యపై వైసీపీ చర్చకు సిద్ధమా అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ సవాల్ చేశారు. 2014-19 మధ్య చేనేతలకు ఇచ్చిన హామీల విషయంలో శాసనమండలిలో వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ దుష్ప్రచారంపై మంత్రి లోకేష్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. వైసీపీ సభ్యులు ఇష్టానుసారంగా మాట్లాడి బయటకు వెళ్లిపోతారని, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. 2014-19 పాలన గురించి మాట్లాడుతున్నారు. అమర్‌నాథ్ గౌడ్ హత్య గురించి కూడా మాట్లాడదాం. బీసీ కుర్రోడిని ఎంత దారుణంగా చంపారో మాట్లాడదాం. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తనదళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన అంశంపై మాట్లాడదాం.ప్రతిపక్ష సభ్యులు సభలో దుష్ప్రచారం చేసి పారిపోవడం సరికాదు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేయలేదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో సమాధానం చెప్పాలని నిలదీశారు. వైసీపీ పాలనలో బీసీ కార్పోరేషన్లకు ఎందుకు నిధులు కేటాయించలేదని నిలదీశారు. గౌరవ బీసీ మంత్రి ప్రజలకు సమాధానం చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేనేతలను మోసం చేసిందని, నేతన్న ద్రోహి జగన్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ 8 నెలల పాలనలోనే చేనేతల అభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు.

# తల్లికి వందనంపై త్వరలోనే గైడ్‌లైన్స్

**మండలిలో మంత్రి నారా లోకేష్**

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్‌ను త్వరలోనే ప్రకటిస్తామని పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

# మంగళగిరిలో రోడ్ల అభివృద్ధికి రూ.9.86 కోట్లు

- మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



మంగళగిరి(చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజక వర్గంలోని మూడు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.86 కోట్ల నిధులు మంజూర య్యాయి. ఈ క్రమంలో త్వరలో పనులు మొదలుపెట్టనున్నారు. దుగ్గిరాల-కొల్లిపర్ర, ఉండవల్లి-యర్రబాలెం వయా పెనుమాక రోడ్డు, దుగ్గిరాల-పెదపాలెం రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. గుంటూరు జిల్లా లోని దుగ్గిరాల-కొల్లిపర్ర మధ్య 4 కి.మీ రోడ్డు అభివృద్ధికి రూ.2.86 కోట్లు, ఉండవల్లి-యర్రబాలెం వయా పెనుమాక రోడ్డుకు సంబంధించి 6.45 కి.మీ రోడ్డు అభివృద్ధికి రూ. 5 కోట్లు, దుగ్గిరాల-పెదపాలెం మధ్య 3 నుంచి 6.2 కి.మీ వరకు రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించారు. ఈ నిధుల విడుదలతో మంగళగిరి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి శరవేగంగా జరగనుంది. మంత్రి నారా లోకేష్ చొరవతో ఇప్పటికే నియోజకవర్గంలోని రోడ్లపై గుంతలు పూడ్చి ప్రయాణికుల కష్టాలు తీర్చారు. తాజాగా ఈ నిధుల విడుదలతో ఆయా గ్రామాల మధ్య రోడ్ల అభివృద్ధితో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిని తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గుంతలతో అనేక మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. నిధుల కొరత పేరిట రోడ్ల వైపు కన్నెత్తి చూడకపోగా రోడ్లు, భవనాల శాఖకు చెందిన స్థిరాస్తులను సైతం తాకట్టు పెట్టింది. రోడ్ల సమస్యపై నాటి ప్రజాప్రతినిధులు, అధికా రుల దృష్టికి ప్రజలు, ప్రజా సంఘాలు తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. అలాగే రోడ్ల విస్తరణకు కార్యా చరణ మొదలు పెట్టింది.

## చిన్నాన్నపై గొడ్డలివేటు వేయించి...

# 'నారాసుర రక్తచరిత్ర' అన్న వారే మారీచులు!

- సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు మళ్లించి పేదలకు ద్రోహం చేశారు

'నా ఎస్సీ ఎస్టీలంటూ మొసలి కన్నీళ్లు కార్చారు.. చెప్పేదొకటి చేసేదొకటికి జిరాక్స్ కాదా?

## వర్దెల్లి మురళి అబద్దాల కుతంత్రం -14

2-3-2025న అవినీతి విష పుత్రిక 'సాక్షి'లో తన యజమాని అవలక్షణాల్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంటగట్టి వర్దెల్లి మురళి మరో అబద్ధాల వ్యాసం రాశారు. "మూడు మాయలేళ్లు కలిసి కూటమి కట్టి ఏర్పాటు చేసిన ప్రభుత్వం నుంచి హామీల అమలు గురించి ఆశించడం అంటే మరీచికల వెంట పరుగులు తీయడమే"నని కూటమిలోని మూడు పార్టీలను మాయలేళ్లు, మరీచకలంటూ సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి చెప్పిన అబద్ధమే వందసార్లు చెబుతున్నారు. ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల్ని ఎల్లవేళలా మోసం చేయడం ఎవరి తరం కాదు. జగన్ మాయమాటలు, సాక్షి అబద్ధపు ప్రచారాలకు ఒకసారి మోసపోయిన ప్రజలు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15,000 ఇస్తామని జగన్ ముఠా ప్రచారం చేసుకుంది. అధికారానికి వచ్చి మాట తప్పి ఒక్కరికే రూ.13,000 మాత్రమే ఇచ్చారు. ఆనాడు రాష్ట్రంలో 85 లక్షల మంది పాఠశాలల్లో పిల్లలుంటే.. అందులో 35 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి ఇచ్చి 40 లక్షల మందికి ఎగనామం పెట్టారు. ఇది జగన్ మాయలేడి తత్వం. కూటమి పాలనలో 'తల్లికి వందనం' పథకానికి బడ్జెట్‌లో 9,407 కోట్లు కేటాయించడం జరిగింది. ఇది 75 లక్షలమంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15,000 ఇవ్వడానికి సరిపోతుంది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లాంటి ఖరీదైన విద్యాసంస్థల్లో చదువుకొనే సంపన్నుల బిడ్డల్ని మినహాయిస్తే మిగతా పిల్లలందరికీ 'తల్లికి వందనం' ఇవ్వబడుతుంది. 35 లక్షల మంది పిల్లలకి రూ.13,000 ఇచ్చిన జగన్ మోసకారి అవుతారు. 75 లక్షల మంది పిల్లలకు రూ.15,000 ఇస్తున్న చంద్రబాబు పేదల పెన్నిధి అవుతారు. చంద్రబాబు మాటపై నిలబడ్డ విద్యాదాత.

జగన్‌రెడ్డి 2019 మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. వెంటనే అమ్మఒడి ఇవ్వలేదు. 2020లో మాత్రమే అమ్మఒడి ప్రారంభించారు. మొదటి ఏడాదిలో పింఛన్లకు పెంచింది రూ.250 మాత్రమే. ఇలా జగన్ మేనిఫెస్టోలోని హామీలు ఐదేళ్లల్లో పూర్తిగా అమలు చేసింది 15శాతం మాత్రమే. 10 లక్షల కోట్లు అప్పు చేసి కూడా హామీల్లో 85శాతం ఎగనామం పెట్టారు. తెచ్చిన అప్పులు అవినీతి స్కీములకు మళ్ళించాడు. సెంటు పట్టాకు సంబంధించిన ఒక్క స్కీమ్‌లోనే రూ.7వేల కోట్లు అవినీతి చేశారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజా, డ్రగ్స్, ఎర్ర చందనం మాఫియాలుగా మారి లక్షల కోట్లు జగన్ ముఠా దోపిడీ చేసింది. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత పింఛన్లు ఒక్కసారిగా రూ.1,000 పెంచి రూ.4,000లు ఇస్తున్నారు. దివ్యాంగులకు పింఛన్లు రూ.3 వేలనుండి రూ.6 వేలకు పెంచారు. కూటమి ప్రభుత్వం ఒక్క పింఛన్లకే ఐదేళ్లల్లో రూ.1.60 లక్షలు ఇస్తోంది. అదేవిధంగా సూపర్ సిక్స్‌లో భాగంగా 93 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇవ్వబడింది. మే, జూన్ నెలల్లో 75 లక్షలమంది పిల్లలకు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ క్రింద రైతులకు రూ.6,300 కోట్లు రాష్ట్ర బడ్జెట్ నుండి ఇవ్వబోతున్నారు. రైతు భరోసాకు రాష్ట్ర నిధుల నుండి ఒక్కొక్క రైతుకు జగన్ ఇచ్చింది రూ.7,500 మాత్రమే. అన్నదాత సుఖీభవకు రాష్ట్ర నిధుల నుండి ఒక్కొక్క రైతుకు చంద్రబాబు ఇస్తున్నది రూ.14,000. జగన్ డీఎస్సీపై మాట తప్పారు. ఒక్క డిఎస్సీ కూడా జరపలేదు. చంద్రబాబు ప్రభుత్వం రేపు పాఠశాలల ప్రారంభ సమయానికి డీఎస్సీ పూర్తిచేసి 16,347 ఉపాధ్యాయ నియామకాలు చేయడానికి విద్యాశాఖమాత్యులు లోకేష్ కృషి చేస్తున్నారు. ఇలా 8 నెలల్లోనే కూటమి ప్రభుత్వం 500కు పైగా మంచి పనులు చేసింది. జగన్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఏడాదికి సుమారు రూ.60 వేల కోట్లు వడ్డీ అసలు వాయిదాలు చెల్లించాలి. దీంతోపాటు ఆయన పెట్టిపోయిన బకాయిలు రూ.1.40 లక్షల కోట్లు చెల్లించాలి. చంద్రబాబు తన అనుభవం, కఠోర శ్రమ, కేంద్రం తోడ్పాటుతో ప్రతి హామీనీ నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నుండి హామీల అమలు గురించి ఆశించడం అంటే మరీచికల వెంట పరుగులు తీయడమే నన్న వర్ధెల్లి మురళి ఆరోపణ పచ్చి అబద్ధమని రుజువైంది. జగన్ ప్రభుత్వ అవలక్షణాల్ని కూటమి ప్రభుత్వానికి అంటగట్టే కుట్ర చేశారు. జగన్ పాలనలో మద్య నిషేధం హామీపై మడమ తిప్పారు. పైగా విషపూరిత మద్యం పోసి 35 లక్షలమంది పేదలని రోగాలపాలు చేశారు. అందులో 30,000 మంది ప్రాణాలు పోయి వారి భార్యల మాంగల్యాలు తెంచారు. మద్యం ధరలు పెంచి రూ.లక్ష కోట్లు జగన్ ముఠా దోపిడీ చేసింది. ఇసుక మాఫియావల్ల ప్రజా రాజధాని నిర్మాణంతోపాటు రాష్ట్రంలో నిర్మాణాలు నిలిచిపోయాయి. దీనివల్ల నాలుగు లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. అన్న క్యాంటీన్లు, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, విదేశీ విద్య, పండగ కానుకలులాంటి 120 చంద్రన్న సంక్షేమ పథకాలు రద్దు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్ళించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి పేదల అసైన్మెంట్ భూములు పది లక్షల ఎకరాలు కబ్జా చేశారు. ఇలా ప్రజల ధన, మాన, ప్రాణాలకు, ఆస్తులకు జగన్ పాలనలో రక్షణలేని స్థితిని ప్రజలు అనుభవించారు. ఈ చేదు జ్ఞాపకాలని సాక్షి మీడియా అబద్ధపు ప్రచారాలతో చెరిపేయగలమనుకుంటే ప్రజల వివేకాన్ని తక్కువ అంచనా వేయడమే. కోడి కత్తి, గులకరాయి డ్రామాలు, వివేకానంద రెడ్డి హత్యతో సానుభూతి నాటకాలు ఇక చెల్లవు. పైగా అలాంటివి ఇప్పుడు రిపీట్ చేస్తే తిరిగి అవి వారి మెడకే చుట్టుకుంటాయి. కూటమి పార్టీల మధ్య చిచ్చు కూడా పెట్టలేరు. ప్రాంతీయ కుల చిచ్చు పెట్టాలనుకున్నా ఇప్పుడు ప్రజలు సాగనివ్వరు. మీ చుట్టూ మూగేది ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం మాఫియా గుంపేగాని ప్రజలు కాదు. అబద్ధాలు, విద్వేషాలు, దౌర్జన్యాలు, కుట్రలతో ఇకపై వైసీపీ మనుగడ సాగించలేదు. మాఫియా మార్గం విడనాడి.. ప్రజాస్వామ్య పంథాకు మారకపోతే వైకాపా తిరిగి కోలుకోదు. 2024 ఎన్నికల్లో కూటమి 57శాతం ఓట్లతో గెలిచింది. ఇప్పుడు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 60శాతం పైగా ఓట్లతో గెలిచారు. కూటమి ప్రభుత్వం 2029లోనూ తిరిగి అధికారానికి వస్తుంది. స్వర్ణాంధ్ర విజన్ -2047 సాధించి, తెలుగువారిని అగ్రస్థానంలో నిలుపుతుంది.



- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

చైతన్యరథం

## మహిళలు, చిన్నారుల భద్రతకు

# ప్రత్యేక రక్షణ విభాగం



- 'ఈగల్' తరహాలో ఐజీ స్థాయి అధికారితో ఏర్పాటు
- మహిళా దినోత్సవాన సీఎం చేతులమీదుగా 'శక్తి యాప్'
- రిమోట్ ఏరియాలో కూడా పనిచేసే విధంగా రూపకల్పన
- వైసీపీ పాలనలో ప్రచారానికి మాత్రమే దిశ పరిమితం
- దానికి చట్టబద్ధత ఎక్కడుంది? ఎంతమందిని కాపాడారు?
- మండలిలో వైసీపీ సభ్యులకు హోంమంత్రి అనిత కౌంటర్

అమరావతి(చైతన్యరథం): మహిళలు, చిన్నారుల భద్రత కోసం 'ప్రత్యేక రక్షణ విభాగం' ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. 'ఈగల్' తరహాలో ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారి దీనికి నేతృత్వం వహిస్తారని తెలిపారు. రాజకీ యాలకతీతంగా వారికి రక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మహిళల భద్రత విషయంలో రాజీపడబోమన్నారు. దిశ యాప్‌తో గత ప్రభుత్వంలో రక్షణ ఉండేదన్న వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి వ్యాఖ్యలపై హోంమంత్రి అనిత కౌంటర్ ఇచ్చారు. దిశ చట్టం కింద ఫిర్యాదు చేసిన కేసు ఒక్కటైనా ఉందా? 'దిశ' కేవలం ప్రచారానికే పరిమి తమైంది.. ఐదేళ్లలో దిశ చట్టాన్ని ఎందుకు చేయలేదు? అంటూ సూటిగా ప్రశ్నించారు. దిశ యాప్‌కు చట్టబద్ధత ఎక్కడుంది? ఎంతమందిని యాప్ ద్వారా కాపాడారు? వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. వేధింపులు జరిగితే దిశ చట్టం కింద ఫిర్యాదు చేసిన కేసు ఒక్కటైనా ఉందా? అని అడిగారు. వైసీపీ ప్రభుత్వంలో పస లేని దిశ చట్టాన్ని పక్కన పెట్టి సరికొత్తగా శక్తి యాప్‌ని తీసుకువస్తున్నట్లు హోంమంత్రి అనిత మండలిలో ప్రకటించారు. నెట్‌వర్క్ లేని రిమోట్ ప్రదేశాల్లో కూడా పనిచేసేలా ప్రత్యేకంగా యాప్‌ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా 'శక్తి యాప్'ను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం 2013 పీఓఎస్‌హెచ్ చట్టం అమలవుతోం దని వెల్లడించారు. 2019-24 వరకూ ఈ చట్టం కింద 85 కేసులు నమోదైనట్లు తెలి పారు. 41ఎ సీఆర్ పీసీ/35(3) కింద 72 మందికి బీన్ఎస్ఎస్ నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం ఈ చట్టం ప్రకారం అందిన ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేసి కేసు నమోదు చేసి 24 మందిని అరెస్ట్ చేశామని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అడిగిన ప్రశ్నకు హోంమంత్రి అనిత సమాధానం చెప్పారు. 2024 సెప్టెంబర్ నుంచి 2025 జనవరి వరకూ కమిటీలకు వచ్చిన ఫిర్యాదులు మొత్తం 50 అని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024లో మొత్తం 30 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 23 మందికి నోటీసులివ్వగా ఐదుగురిని ఇప్పటివరకూ అరెస్ట్ చేసినట్లు స్పష్టం చేశారు. వేధింపులు, దాడులకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేయడానికి జిల్లా స్థాయి స్థానిక ఫిర్యా దు కమిటీ, అంతర్గత ఫిర్యాదు కమిటీ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి పది మం ది మహిళలతో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం ఉంటుందని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలలో ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీలు 6,681 గా తేల్చి చెప్పారు. రాష్ట్ర పునర్ విభజన తర్వాత ఏపీ వ్యాప్తంగా 26 ఎల్సీ, ఐసీ కమిటీలు ఏర్పాటయ్యాయన్నారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో రక్షణకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి తెలిపారు. ఏదైనా ఇబ్బంది జరిగినపుడు చెప్పుకోవడానికి భయపడి ఆగిపోకుండా అవగాహన కలిగించి వారికి న్యాయం చేస్తామనే భరోసా అందిస్తామన్నారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖను అడగాల్సిన ప్రశ్నలను వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి హోంమంత్రిని అడుగుతున్నారన్నారు. ఏ ప్రశ్న ఎవరిని అడగాలో అవగాహనతో ఉంటే బాగుంటుందన్నారు. శాసన మండలిలో మంగళవారం వైసీపీ ఎమ్ఎల్సీలు వరుదు కళ్యాణి, ఏసురత్నంల ప్రశ్నలకు హోంమంత్రి అనిత ధీటుగా బదులిచ్చారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచలేదు.. పెంచబోం



- ఐదేళ్లలో 9 సార్లు పెంచిన ఘనత జగన్‌దే
- అరాచక పాలనతో ఆ రంగాన్ని నాశనం చేశారు
- రూ.15 వేల కోట్ల విద్యుత్ భారం మోపారు
- విద్యుత్ సంస్థల నిధులూ బేవరేజెస్‌కు మళ్లించారు
- ఛార్జీల పెంపుపై మాట్లాడే అర్హత వారికి లేదు
- 65 శాతం విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించాం
- తమ ప్రభుత్వంలో మిగులు విద్యుత్‌గా నిలిపాం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలను ఇప్పటివరకు పెంచలేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశా రు. భవిష్యత్తులో కూడా పెంపు ఉండబోదని శాసన మండలి సాక్షిగా ప్రకటించారు. మండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు శివరామిరెడ్డి, అరుణ్ కుమార్, రవిబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన తీరును సభకు వివరిం చారు. తద్వారా వైసీపీ నేతలు చేస్తున్న సత్యదూరమైన ఆరోపణలను తిప్పి కొట్టారు. విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ నాయకులకు కనీసం మాట్లాడే అర్హత కూడా లేదని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం చివరి రెండేళ్ల పాలనలో ప్రజలపై రూ.15,000 కోట్ల విద్యుత్ భారం మోపిన విషయాన్ని గుర్తుచేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.8,113 కోట్లకు పైగా విద్యుత్ ఛార్జీలను పెంచి ఈఆర్సీకి పంపిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా మరో రూ.11,000 కోట్లు పెంపుపై ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి కావాల్సి ఉండగా, దానిని దాదాపు 20 నెలల కాలా నికి సాగదీసిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ ప్రతిపాదనలతో పెరిగిన రూ. 15,000 కోట్ల విద్యుత్ భారాన్ని కూటమి ప్రభుత్వంపై మోపేలా ప్రజలను మభ్య పెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఛార్జీలు పెంచిన వాళ్లే రోడ్లెక్కి ధర్నాలు చేయడం, ప్రశ్నలు వేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

### తెలుగుదేశం ప్రభుత్వంలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా..

రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఏపీ విద్యుత్ ఉత్పత్తి పరంగా అనేక అవాంతరాలు ఎదుర్కొందని తెలిపారు. 2014లో అధికారం చేపట్టిన టీడీపీ విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టిందని పేర్కొన్నారు. 2014 - 2019 మధ్య కాలంలో ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని వివరించారు. 2019 ఎన్నికల సమయానికి ఆంధ్రప్రదేశ్ మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిచిందని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో విద్యుత్ రంగ అభివృ ద్ధికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు.

అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కృష్ణపట్నం రెండో ఫేజ్, ఇబ్రహీంపట్నం వీటీపీ ఎస్ ఐదో ఫేజ్ ప్లాంట్లను షట్‌డౌన్ చేయించి ఉత్పత్తిని నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పోలవరం ప్రాజె క్ట్ 2019 సమయానికి 70 శాతం పూర్తయినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో మిగిలిన 30 శాతం పూర్తి చేయలేదని చెప్పారు. అంతేకాకుండా కొత్త పవర్ ప్లాంట్ల నిర్మా ణాలు లేకుండా చేశారని ఆరోపించారు. పునరుత్పాదక విద్యుత్ రంగానికి సంబంధించి గత ప్రభుత్వం సోలార్, విండ్ ఉత్పత్తిని కూడా ఆపేసిన విషయాన్ని గుర్తుచేశారు. షార్ట్ టైం పవర్ పర్చేజ్‌ల పేరుతో సుమారు రూ.10,000 కోట్లతో విద్యుత్ కొనుగోళ్ల చేసి ఆ భారం ప్రజలపై వేశారని మంత్రి వెల్లడించారు. విద్యుత్ సంస్థల నిధులను కూడా బేవ రేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించిన ఘనత జగన్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు.

### జగన్ లేఖతో రాష్ట్రానికి అపార నష్టం

అడ్డగోలు విద్యుత్ కొనుగోళ్లతో రాష్ట్ర ఖజానాపై భారం మోపడమే కాకుండా పీఎం కుసుమ్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌కు వద్దంటూ వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం జగన్‌రెడ్డి అరాచక పాలనకు అద్దం పడుతుందని విమర్శించారు. పీపీఏలను రద్దు చేయ డమే కాకుండా ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని తెలిపారు. పెట్టుబడిదా రులను రాష్ట్రం నుంచి తరిమేశారని వాపోయారు. అంతేకాకుండా విదేశీ ప్రతినిధులతో తిట్లు కూడా తిన్నారని ఎద్దేవా చేశారు. ఇవేమీ బయటపడకుండా... సత్యదూరమైన మాటలతో కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టే ప్రయ త్నం చేస్తున్నారని విమర్శించారు. 2014 -19 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క రూపాయి విద్యుత్ ఛార్జీలను పెంచ లేదని, ఇకపైనా పెంచబోమని మరోసారి స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు జెన్కో ద్వారా నాణ్యమైన విద్యుత్‌ను రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

### కేంద్ర సహకారంతో రైతులకు పగటి పూటే 9 గంటల విద్యుత్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 65 శాతం విద్యుత్ కొనుగోళ్లను తగ్గించా మని సభాముఖంగా తెలిపారు. జెన్కోను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నా మని తెలిపారు. ఉత్పత్తి అయిన విద్యుత్ నిరుపయోగం కాకుండా కేంద్ర ప్రభుత్వ సహా య, సహకారాలతో బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థను తీసుకొస్తున్నామని వెల్లడించారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పీఎం కుసుమ్ పథకం కావాలంటూ ప్రధానికి లేఖ రాసిన విషయాన్ని వివరించారు. కుసుమ్ పథకం ద్వారా ఇప్పటికే లక్ష కనెక్షన్లు తీసుకున్నామని...మరో రెండు లక్షల కనెక్షన్లకూ అనుమ తులు మంజూరయ్యాయని వివరించారు. పీఎం కుసుమ్ సహకారంతో రైతులకు పగటి సమయంలోనే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తు న్నామని పేర్కొన్నారు.

చైతన్యరథం

# నాసిరకం మద్యంతో వేల కోట్లు దోచారు

- జే బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారు
- నచ్చిన కంపెనీలకే ఆర్డర్లతో భారీగా వసూళ్లు
- సిట్ ఏర్పాటు రోజే డాక్యుమెంట్ల దహనం
- అక్రమాలు మొత్తం పూర్తిగా బయటపెడతాం
- బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం
- తమ ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం, బ్రాండ్లు
- పారదర్శకంగా దుకాణాల కేటాయింపు
- అసెంబ్లీలో మద్యం విధానంపై కొల్లు రవీంద్ర

అమరావతి(చైతన్యరథం): గత జగన్‌రెడ్డి పాలన 2019-24 మధ్య కాలంలో మద్యం ఆర్డర్లన్నీ నచ్చిన వారికే ఇచ్చుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర మండి పడ్డారు. కొత్తగా 7 కంపెనీలను ఏర్పాటుచేసి దాదాపు 63 శాతానికి పైగా ఆర్డర్లు ఆ ఏడు కంపెనీలకు కట్టబెట్టి ప్రతి కేసుకు సగటున రూ.200 వరకు అనధికారికంగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నా యని మద్యం విధానంపై అసెంబ్లీలో సభ్యులు అడిగి న ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మద్యం, బీర్ల ద్వారా రూ.3113 కోట్లు దోచుకున్నారనే ఆధారాలు ఉన్నాయి.. గతంలో ఐఎంఎఫ్ఎల్ మద్యం అన్ని రాష్ట్రాల్లో కూడా దొరికేవే ఇక్కడా దొరికేవి. కానీ గత ఐదేళ్లు స్థానిక బ్రాండ్లను తీసుకొచ్చి మిగిలిన బ్రాండ్లను తొక్కిపెట్టారు. గతంలో జాతీయ, అంతర్జాతీయ మద్యం కంపెనీలు మద్యం సరఫరా చేస్తే గత ఐదేళ్లువాటిని బెదిరించి భయపెట్టి కంపెనీలను లాక్కున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్ఎన్‌జే, ఆదాన్, లీలా, ఎన్‌వీ, బీ9, సోనా, మునాక్ వంటి కంపెనీలను స్థాపించి ఆయా కంపెనీలకే 60శాతానికి పైగా ఆర్డర్లు ఇచ్చారు. కమీషన్లు ఇవ్వని కంపెనీలను ఎంత దారుణంగా తొక్కిపెట్టారంటే.. 2018లో ఆఫీసర్స్ ఛాయిస్ 35లక్షల కేసులు సరఫరా చేస్తే.. గత ప్రభుత్వంలో సరఫరా చేసింది కేవలం 5 లక్షల కేసుల ఆర్డర్లు మాత్రమే. మెక్‌డోవెల్స్ అయితే 22 లక్షల కేసుల నుంచి 5 కేసులకు కుదించారని గుర్తుచేశారు.



### నాసిరకం మద్యంతో ప్రాణాలు తీశారు

2018-19లో తెలంగాణతో పోలిస్తే రెవెన్యూ వ్యత్యాసం రూ.4186 కోట్లు మాత్రమే.. కానీ 2023-24 నాటికి ఏకంగా రూ.42,762 కోట్లకు చేరింది. ఇందుకు కారణం నాణ్యమైన బ్రాండ్లను దూరం చేసి కల్తీ, నాసిరకమైన జే బ్రాండ్లను తీసుకురావడమే. కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దడంతో జంగారెడ్డిగూడెంలో ఏకంగా 42మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం నాణ్యతను గాలికి వదిలేయడంతో మద్యం ఆధారిత నేరాలు, ఆత్మహత్యలు, కిడ్నీ, లివర్ సమస్యలు భారీగా పెరిగాయి. గుంటూరు జీజీహెచ్ డీ అడిక్షన్ కేంద్రంలో 2018లో 343 కేసులుంటే.. 2023 నాటికి ఏకంగా 4913 మందికి చేరారని గుర్తుచేశారు.

### కూటమి పాలనలో నాణ్యమైన బ్రాండ్లు

కూటమి అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యం అందించడమే లక్ష్యంగా పరీక్షలకు ప్రాధాన్యత ఇచ్చాం. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ఈఎన్‌ఏని 13 రకాలుగా, విస్కీ, బ్రాందీ, జిన్, వోడ్కాను 9 రకాలుగా, రమ్ 9 రకాల పరీక్షలు, బీర్ ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఏ స్థాయిలో కూడా కల్తీ అవ్వడానికి వీలు లేకుండా ప్రొడక్షన్ నుంచి మద్యం షాపుల వరకు శాంపిల్స్ తెప్పించి పరీక్షిస్తున్నాం. గత ఐదేళ్ల పాటు ఎక్కడా డిజిటల్ పేమెంట్స్ లేకుండా క్యాష్ అండ్ క్యారీతో ప్రజలను దోచుకున్నా రు. కూటమి అధికారంలోకి వచ్చాక 3396 షాపులను అత్యంత పారదర్శకంగా కేటాయించాం. దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.1797 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. తొలిసారిగా ఏపీలో కల్లుగీత కార్మికులకు 350 షాపులు కేటాయించాం. లైసెన్సు ఫీజులో రూ.103 కోట్ల సబ్సిడీ భరిస్తున్నాం. కూటమి అధికారంలోకి వచ్చాక 150కి పైగా బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చి వినియోగదారులు కావాల్సిన బ్రాండ్ తీసుకునే వెసులుబాటు కల్పించాం. అదే సమయంలో రూ.99కే క్వార్టర్ మద్యాన్ని తీసుకొచ్చి పేదలు కల్తీ మద్యం వైపు, నాటు సారా వైపు మళ్లకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సీఐడీ విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలు మొత్తం బయటపెట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం అక్రమాల విచారణకు సిట్ ఏర్పాటు చేసిన రోజునే తాడేపల్లి ప్యాలెస్ వద్ద డాక్యుమెంట్లు తగులబెట్టారు. ప్రజల జేబులు కొల్లగొట్టిన వారిపై తప్ప కుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మూడేళ్లలో భూముల రీ సర్వే పూర్తి

- ప్రస్తుతం మండలానికో గ్రామంలో ప్రాజెక్ట్
- గత ప్రభుత్వంలో తప్పులతడక, ప్రచార ఆర్భాటం
- వాటిని సరిదిద్దేందుకు సకాలంలో చర్యలు
- 6688 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాం
- 2.79 లక్షల ఫిర్యాదుల్లో 90 శాతం పరిష్కారం
- అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో తప్పుల తడకగా సాగిన భూముల రీ సర్వేను సరిదిద్దుతున్నామని, తమ ప్రభుత్వం తిరిగి ప్రారంభించిన రీ సర్వేలో ఎలాంటి తప్పులకు అస్కారం లేకుండా చాలా పకడ్బందీగా కొనసాగిస్తు న్నామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎలాంటి హడావిడి లేకుండా భూయజమానులను ఒప్పించి ప్రతిష్ఠాత్మ కంగా రీ సర్వే ప్రాజెక్టును మూడేళ్ల సమయంలో పూర్తి చేస్తామని చెప్పారు. జనవరి 20న తమ ప్రభుత్వం భూముల రీ సర్వేను తిరిగి ప్రారంభించిందని, అయితే ఈసారి ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకుని రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామాన్ని బ్లాకులుగా విభజించి, ప్రతి బ్లాక్‌కు అధికారులను కేటాయించి రోజుకు 20 ఎకరాల మేరకే రీ సర్వే చేయిస్తున్నామని చెప్పారు. రీ సర్వే చేసే ముందు ఆ భూమికి సరిహద్దుల్లో ఉన్న భూ యజమానులందరికీ నోటీసులు ఇచ్చి వారి సమక్షంలోనే రీ సర్వే చేస్తున్నారని చెప్పారు.ఒక బ్లాక్‌లో ఉన్న భూ యజమానులందరికీ వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి అందరికీ ఎప్పటిక ప్పుడు సమాచారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో మంగళవారం ప్రశోత్తరాల సమయంలో భాగంగా రీ సర్వే అంశంపై టీడీపీ సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, కూన రవికుమార్, బోనెల విజయచంద్ర, రాజగోపాల్ అడిగిన ప్రశ్న లకు మంత్రి సమాధానమిచ్చారు. గత ప్రభుత్వ కాలంలో 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారని, కానీ ఆ రీ సర్వే అంతా తప్పుల తడకగా మారిందన్నారు. రీ సర్వేకు సంబంధించి భూ యజమాను లకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని, రీ సర్వే పూర్తయిన తర్వాత భూ యాజ మానులు అభ్యంతరాలు తెలిపేందుకు 60 రోజులగా ఉన్న గడువును 21 రోజులకు కుదించారని వివరించారు. నిబంధనల ప్రకారం కాకుండా సరిహద్దు రాళ్లపైన తమ బొమ్మలు వేసుకోవాలనే పిచ్చితో హడావిడిగా రీ సర్వే చేశారని చెప్పారు. పాస్ పుస్తకాలపైన తన బొమ్మలు వేసు కోవాలనే పిచ్చి తప్ప రీ సర్వేను సక్రమంగా చేయాలనే ఆలోచన జగన్‌రెడ్డి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. అప్పటి రీ సర్వేపై భూ విస్తీర్ణం, సరిహద్దు, పేర్లు దిద్దుబాటు, భూ వర్గీకరణ సమస్యలపైన భూ యజమానులు కూడా అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వీటిని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం రీసర్వే పూర్తయిన అన్ని గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీక రించిందని చెప్పారు. వీటికి సంబంధించి దాదాపు 2,79,712 అర్జీలు రాగా 2,57,881 అర్జీలను పరిష్క రించామని, మిగిలిన 21,831 అర్జీలను మార్చి 31 లోగా పరిష్కరిస్తామని చెప్పారు. వచ్చిన అర్జీల్లో విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు సంబంధించి 99,216 అర్జీలు రాగా 89,473 అర్జీలను పరిష్కరించామని, జాయింట్ ఎల్పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) సమస్య పై 64,441 అర్జీలు రాగా 57,527 అర్జీ లను పరిష్కరించామని, పేర్లు మార్పు, వ్యక్తిగత వివరాలు, భూమి వర్గీకరణ వంటి రెవెన్యూ అంశాలకు సంబంధించి 1,16,055 అర్జీలు రాగా 1,10,881 అర్జీలను పరిష్కరించామని తెలిపారు. జాయింట్ ఎల్పీఎంలలో సమస్యలు ఉత్పన్న మయ్యాయని, ఒకే ఎల్పీఎంలో వేర్వేరు భూ యజమానులు ఉండడంతో వారిని వ్యక్తిగత ల్యాండ్ పార్సిల్స్‌గా సబ్ డివిజన్ చేసేంత వరకు వారు తమ ఆస్తులను మ్యూటేషన్ లేదా రిజిస్ట్రేషన్ చేయించడానికి ఇబ్బంది ఏర్పడిందని చెప్పారు. జాయింట్ ఎల్పీఎంలను విడగొట్టి రిజిస్ట్రేషన్‌కు అనుకూలంగా మార్చేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ సబ్ డివిజన్ సిటిజన్ సర్వీసులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సబ్ డివిజన్ చేసుకునే భూ యజమానులకు ఈ ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆరు నెలల పాటు ఫీజు నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటి వరకు సబ్ డివిజన్ కోసం 71,337 దరఖాస్తులు రాగా 62,816 దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. 22 ఏ 1(సీ)లో పెట్టిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఉప సంఘం సిఫార్సులతో ఆ భూములపై త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

# జైపూర్ సదస్సుకు మంత్రి నారాయణ



- స్వచ్ఛాంధ్ర, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రసంగం
- విజన్ డాక్యుమెంట్‌లో కీలకమని వెల్లడి

అమరావతి(చైతన్యరథం): జైపూర్‌లో మంగళవారం జరిగిన 12వ ఆసియా పసిఫి క్ రీజినల్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం అంతర్జాతీయ సదస్సులో మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీ కృత వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సంస్కరణలపై సదస్సులో చర్చ జరిగింది. కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్, పలు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. భూపేంద్ర యాదవ్‌తో కలిసి సదస్సులోని వివిధ దేశాల పెవిలియన్‌లను మంత్రి నారాయణ పరిశీలించారు. ఏపీ విజన్‌పై సదస్సు లో ప్రసంగించారు. 2047నాటికి స్వర్ణాంధ్ర సాధించాలనేది లక్ష్యం. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర టార్గెట్‌తో ముందుకెళుతున్నాం. స్వచ్ఛాంధ్ర అనేది 2047విజన్ డాక్యుమెంట్‌లో కీలక భూమిక పోషిస్తుందని తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ సమతుల్యత, సమగ్ర ఆర్థిక వ్యవస్థ స్వచ్ఛాంధ్ర లక్ష్యాలు వివరించారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్ కంట్రోల్, వాతావరణ పరిస్థితులు సమతుల్యం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. 2047 నాటికి జీరో వేస్ట్ క్లైమేట్ రెసిడెన్స్ సాధించేందుకు ఏపీ కట్టు బడిఉందని పేర్కొన్నారు.అమరావతి నిర్మాణంలో ఉత్తమ పద్ధతులతో ఆకట్టుకునేలా సర్క్యులర్ ఎకానమీ దిశగా సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వివరించారు. స్వచ్ఛాంధ్ర అనేది కేవలం పరిశుభ్రత మాత్రమేకాదు.. భవిష్యత్తు తరాలకు నీరు, భూమిని పరి రక్షించాలనేదే లక్ష్యమని వివరించారు.



# విశాఖ సహకార బ్యాంక్‌లో భారీ కుంభకోణం





- వైసీపీ నేతల అండతో రూ.300 కోట్ల స్వాహా
- గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయి
- విచారణకు ఆదేశించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన రవినాయుడు, దూండి రాకేష్

మంగళగిరి(చైతన్యరథం): విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో నాడు వైసీపీ నేతల అండతో దాదాపు రూ.300 కోట్ల కుంభకోణం జరిగిందని..ఇందుకు కార కులైన అధికారులు ఇంకా విధుల్లో కొనసాగుతున్నారని అనకాపల్లికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వి.పైడారావు ఫిర్యాదు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల్లో ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఘటనపై పూర్తిగా విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ అర్జీలు స్వీకరించారు.

– ఆళ్ల రాజా అనే వ్యక్తి మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు అండతో తమ ఇంట్లోకి తాగి వచ్చి తమ ఆడవారిపై దాడి చేయడమే కాకుండా తిరిగి తమపైనే అక్రమ కేసులు పెట్టారని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలానికి చెందిన శేషగిరి ఆవేదన వ్యక్తం చేశారు. తాము స్టేషన్ వెళ్లి వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు తీసు కోవడం లేదని ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

– తమ భూమిని పక్కవారు ఆక్రమించుకున్నారని.. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాతూరు గ్రామానికి చెందిన పి.బత్తెమ్మ ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

– తాము గతంలో కొనుగోలు చేసిన భూమికి అన్ని రికార్డులు ఉన్నా 22ఏలో పెట్టా రని కృష్ణా జిల్లా గన్నవరం మండలం నున్న గ్రామానికి చెందిన జె.లక్ష్మీనారాయణ తెలి పారు. తమ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు.

– సత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలానికి చెందిన తవలం వెంకట రమణ సమస్యను వివరిస్తూ తమ నాయనమ్మకు ప్రభుత్వం ఇచ్చిన భూమి వారసత్వంగా తమకు రావాల్సి ఉండగా సర్పంచ్ బంధువులు ఆ స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. వారి నుంచి తమ స్థలాన్ని విడిపించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

– తమ తండ్రి నుంచి తమకు వారసత్వంగా వచ్చిన భూమిని అన్నదమ్ములం పంచుకుని పన్ను కట్టి అనుభవిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం విన గడప గ్రామానికి చెందిన నాగళ్ల నరసింహారావు తెలిపారు. కొవిడ్ సమయంలో కొంత కాలం ఆ భూమి వైపు వెళ్లకపోవడంతో బరోతు సోమ్లానాయక్ అతని కుమారులు ఆ భూమిని ఆక్రమించుకుని గత ప్రభుత్వంలో ఆన్‌లైన్‌లో పేర్లు మార్చి దౌర్జన్యం చేస్తు న్నారని వివరించారు. వారి నుంచి తమ భూమిని విడిపించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

– తమకు వారసత్వంగా వచ్చి భూమిని ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వమంటే అధికారులు పట్టించుకోవడం లేదని అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం మాసా పేటకు చెందిన షేక్ సయ్యద్ బాషా ఫిర్యాదు చేశారు. తమ భూ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు.

– 1988లో తమ తండ్రికి డి పట్టా భూమి ఇవ్వగా దానిని తమకు తెలియ కుండా మరొకరికి అక్రమంగా 1బీలో ఎక్కించారని అనంతపురం జిల్లా గార్ల దిన్నె మండలం మార్తాండు గ్రామానికి చెందిన వి.లక్ష్మి ఫిర్యాదు చేశారు. 2022లో జరిగిన ఈ అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేసి తమ భూమి తమకు ఉండేలా చూడాలని కోరారు.









# జర్మనీ పర్యటనకు కందుల దుర్గేష్

- ఐటీబీ బెర్లిన్ సదస్సులో పాల్గొననున్న మంత్రి
- ఎయిర్ పోర్ట్‌లో స్వాగతం పలికిన నాయకులు

అమరావతి(చైతన్యరథం): జర్మనీలోని బెర్లిన్ ఎక్స్‌పో సెంటర్ సిటీలో ప్రారంభ మయ్యే ఐటీబీ బెర్లిన్-2025 సదస్సులో పాల్గొనేందుకు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ జర్మనీ బయలుదేరి వెళ్లారు. అక్కడి ఎయిర్‌పోర్టులో ఆయనకు కూటమి శ్రేణు లు స్వాగతం పలికారు. పర్యాటక రంగా నికి అంతర్జాతీయ పెట్టుబడులు సాధిం చేందుకు ఏపీ పర్యాటక రంగంలో అవకా శాలు, వనరుల గురించి వివరించనున్నా రు. పర్యాటక, అతిథ్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఎకో టూరిజంలో పెట్టుబడి, వివిధ రకాల పర్యాటక అవకా శాలను వివరించనున్నారు. దాదాపు 30 మందిపైగా పెట్టుబడిదారులతో ప్రత్యేకం గా భేటీ అవుతారు. అంతర్జాతీయ మీడి యాతో ఏపీలో పర్యాటక అవకాశాలను వివరించనున్నారు. మంత్రి దుర్గేష్‌తోపాటు ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట బెర్లిన్‌కు వెళ్లారు.



నెలలో రెండుసార్లైనా

# ఆర్థిక కమిటీలు భేటీకావాలి

## శాసన సభా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు



అమరావతి (చైతన్య రథం): శాసన సభా ఆర్థిక కమిటీలు నెలలో కనీసం రెండుసార్లు సమావేశం కావాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. మంగళవారం రాష్ట్ర శాసన సభా భవనంలో శాసనసభ ప్రజాపద్దుల కమిటీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ), శాసనసభ అంచనాల కమిటీ (ఎస్టిమేట్స్ కమిటీ) మరియు ప్రభుత్వ సంస్థల కమిటీ (పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ)ల ప్రాథమిక సమావేశం స్పీకర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటు చేయడంలో ఇప్పటికే ఆలస్యమైందన్నారు. కమిటీ మెంబర్లు చురుగ్గా ఉండాలని, దానివల్ల అసెంబ్లీ ప్రొసీడింగ్స్, హౌస్‌ను నడిపించడం సులువవుతుందన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో బడ్జెట్ సమావేశాలు 60 రోజులుపాటు జరిగేవని, అవి అర్ధరాత్రి 12 గంటల వరకూ కూడా జరిగేవన్నారు. అలాంటివి నేడు 15 రోజులకు తగ్గిందన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన అన్ని రాష్ట్రాల స్పీకర్ల సమావేశంలో పాల్గొన్నప్పుడు ఏ రాష్ట్రమైనా సరే అసెంబ్లీ సమావేశాలను సంవత్సరానికి కనీసం 60 రోజులపాటు జరపాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇందుకు అన్ని రాష్ట్రాల సభాపతులు ఆమోదం తెలిపారన్నారు. కాబట్టి ఈ కమిటీలు నెలలో కనీసం రెండుసార్లు సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఏ ఉద్దేశంతో ఈ కమిటీలు ఏర్పాటు చేశారో ఆ లక్ష్యాల సాధనకు అనుగుణంగా సభ్యులందరూ సహకరించి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి పబ్లిక్ ఆడిట్ జనరల్ సలహాలు, సూచనలను కమిటీ సభ్యులు తప్పక పరిగణలోకి తీసుకోవాలన్నారు. తాము కూడా ఈ కమిటీలకు సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు.

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ మూడు కమిటీలు ఎంతో ముఖ్యమైనవని, సంబంధించిన చైర్మన్లు, సభ్యులందరూ అర్థవంతంగా చర్చల్లో పాల్గొనాలన్నారు. అలాగే క్షేత్రస్థాయి పర్యటనలు కూడా చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీలు తరచూ సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కమిటీల సమావేశాలను మినీ అసెంబ్లీలుగా భావించి పాల్గొనాలన్నారు. ఈ సమావేశాలు శాసనసభ సమావేశాలంత ముఖ్యమైనవిగా భావించాలన్నారు. సమావేశాలను గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించి మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఈ పదవి తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, తనను చైర్మన్‌గా నియమించినందుకు సభాపతికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా, వివేకవంతంగా తమ కమిటీ పనిచేస్తుందన్నారు. ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు మాట్లాడుతూ తనను చైర్మన్‌గా నియమించినందుకు శాసనసభాపతికి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ తనకు అప్పగించిన కమిటీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వరంగ సంస్థల కమిటీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ ఈ కమిటీల ప్రారంభ సమావేశాన్ని ప్రారంభించాల్సిందిగా శాసనసభ స్పీకర్‌ను అభ్యర్థించినప్పుడు వారు అంగీకరించినందుకు, అలాగే ఈ కమిటీకి తనను అధ్యక్షునిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎప్పటికప్పుడు కంట్రోల్ ఆడిటర్ జనరల్ సూచనలు అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే సంస్థలు ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయ లేదా అనే అంశాలను పరిశీలిస్తామన్నారు. అకౌంటెంట్ జనరల్ పంపే సమాచారాన్ని పరిశీలించి ఆడిట్ పేరాలలోని లోటుపాట్లపై తరచూ సమావేశాన్ని నిర్వహించి, సభ్యుల సహకారంతో అన్ని అంశాలను పూర్తి చేస్తామని తెలిపారు.

అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ తల్లూరి భాస్కర్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, శాసనసభ అంచనాల కమిటీ మరియు పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీల సభ్యులతో పాటు పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



## యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి: లోకేష్

అమరావతి (చైతన్య రథం): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్ మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలను మంత్రి అభినందించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఈ విజయంతో మనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రాష్ట్రంలో యువత మనపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో దేవినేని ఉమ, నెట్టెం రఘురాం, ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే వర్మ, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు తదితరులున్నారు.





## ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త

అమరావతి (చైతన్య రథం): ఏపీలో నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితిని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి 34నుంచి 42ఏళ్లకు, యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే నియామకాలకు వయోపరిమితి పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది.

## ఏడీసీ సీఎండీతో ప్రపంచబ్యాంకు బృందం భేటీ



అమరావతి (చైతన్య రథం) ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు రుణంతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలపై అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులతో ప్రపంచబ్యాంకు బృందం సమావేశమైంది. ఏడీసీ సీఎండీ డి లక్ష్మీపార్థసారథితో బ్యాంకు ప్రతినిధులు రుణం మంజూరు చేస్తున్న ప్రాజెక్టు నిర్మాణాలపై చర్చించారు. ముఖ్యంగా అమరావతి నగరానికి కావాల్సిన తాగునీటి సరఫరాపై చర్చ జరిగింది. తాగునీటి సరఫరా వ్యవస్థకు చేపడుతున్న ముఖ్యమైన మౌలిక సదుపాయాల రూపకల్పనపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో నివసించే ప్రజలకు తాగునీటి లభ్యతకు గల అవకాశాలతో పాటు, నీటిని శుద్ధి చేసి పంపిణీ చేసే వ్యవస్థపై ఏడీసీ అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి టెండర్లు రూపొందించినట్టు సీఎండీ.. బ్యాంకు ప్రతినిధులకు స్పష్టం చేశారు.

## భీమసింగి సుగర్స్ కార్మికులను ఆదుకుంటాం: కొండపల్లి



అమరావతి (చైతన్య రథం): విజయనగరం జిల్లా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు, ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, విదేశీ వ్యవహారాల, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మంగళవారం లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, సుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగ సంఘాల నేతలతో సచివాలయంలో మంత్రి కార్యాలయంలో సమావేశమై రైతుల, ఉద్యోగుల సమస్యలతో పాటు వారికి అందవలసిన పీఎఫ్, గ్రాట్యుటీపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏటికొప్పాక, తాండవ, భీమసింగి సుగర్స్ కార్మికులకి చెల్లించాల్సిన బకాయిల కోసం తగిన చర్యలు తీసుకుందని, ముఖ్యమంత్రి అనుమతితో త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని కార్మిక సంఘాల నాయకులకి హామీ ఇచ్చారు. లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి మాట్లాడుతూ సక్రమంగా క్రషింగ్ జరుగుతున్న ఫ్యాక్టరీని గత ప్రభుత్వంలోని పెద్దలు అవగాహన లోపంతో మూసివేసి రైతులను, కార్మికులను రోడ్డున పడేశారని, కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీని తిరిగి తెరిపించినా, లేక మరోవిధంగా ఉపయోగించుకున్నా ఫరవాలేదని, రైతులను, కార్మికులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి యువరాజ్, కార్మిక సంఘాల నేతలు, తెలుగుదేశం నేతలు పొలుపర్తి స్వామినాయుడు, జాగరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాలకు

## ఉచితంగా స్థలాలివ్వండి: తితిదే చైర్మన్ లేఖ



అమరావతి (చైతన్య రథం): దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయం నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదని, సమాజాభివృద్ధికి దోహదపడతాయని ఆ లేఖలో పేర్కొన్నారు. 'దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. ఆధ్యాత్మికతవైపు అందరూ అడుగులేస్తున్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండాలి. దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా శ్రీవారి ఆలయాలు ఉండాలి. కోట్లమంది భక్తులు దేవాలయాలకు విరాళాలు ఇస్తున్నారు. వాటిని విద్య, వైద్యంసహా ఇతర సేవాకార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నాం. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు దేవాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. 14 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు పంపించిన తితిదే.. ఒక్క ఉత్తరప్రదేశ్‌లో మాత్రం రాజధానిలో కాకుండా.. వారణాసిలో గంగా నదీతీరప్రాంతంలో స్థలం కేటాయించాలని కోరారు.

# ఇన్వెస్ట్‌మెంట్స్ హబ్‌గా ఏపీ

- పోర్టుల అభివృద్ధికి లాజిస్టిక్స్ కీలకం
- 2030నాటికి మారిటైం గేట్‌వేగా భారత్
- సామర్థ్యం పెరిగేలా భాగస్వామ్యపక్షాలతో చర్చలు
- పెట్టుబడుల మంత్రి జనార్థన్ రెడ్డి స్పష్టీకరణ
- విజయవాడలో 'మారిటైం' సదస్సుకు హాజరైన మంత్రి




అమరావతి (చైతన్యరథం): భవిష్యత్తులో ప్రపంచస్థాయి పెట్టుబడులకు హబ్‌గా ఏపీని తీర్చిదిద్దనున్నట్టు రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి స్పష్టం చేశారు. మారిటైమ్-లాజిస్టిక్స్ రంగాల్లో ఏపీ సామర్థ్యం మరింత మెరుగుపడేలా భాగస్వామ్యపక్షాలతో సాగించే చర్చలు ఉపయోగకరమన్నారు. విజయవాడ నోవాటెల్‌లో మంగళవారం మారిటైం, లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌పై ఆంధ్రప్రదేశ్ స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్‌తో సదస్సు నిర్వహించారు. సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి హాజరైన భాగస్వామ్యపక్షాల ప్రతినిధులు, వివిధ సంస్థల అధిపతులు తమ భావాలను పంచుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాలు కార్యదర్శి యువరాజ్, ఏపీ మారిటైం బోర్డ్ సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఫిషరీస్ కమిషనర్ రామ్‌శంకర్ నాయిక్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈవో శేఖర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సులో మంత్రి జనార్థన్‌రెడ్డి మాట్లాడుతూ.. సదస్సులో చర్చకొచ్చిన అంశాలు ఎంతో విలువైనవి... ఏపీని ప్రపంచస్థాయి పెట్టుబడులకు హబ్‌గా, మారిటైమ్ -లాజిస్టిక్స్ రంగాల్లో నాయకత్వ పటిమకు బలం చేకూర్చేలా ఉన్నాయన్నారు.

'2022 సెప్టెంబర్ 17న నేషనల్ లాజిస్టిక్స్ పాలసీని కేంద్రం ప్రకటించిందని, 2030నాటికి లాజిస్టిక్స్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్‌లో భారత్ టాప్ 25లో ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. ఇందుకనుగుణంగా తాజాగా ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ ఫెర్ఫార్మెన్స్ ఇండెక్స్ 2023 ప్రకారం భారత్ 38వ స్థానానికి చేరుకోవడం సంతోషించదగ్గ అంశం. ఈ నివేదిక ప్రకారం మన దేశంలో పోర్టులు అభివృద్ధి చెందిన దేశాలు అమెరికా, ఆస్ట్రేలియా, బెల్జియం, జర్మనీ, సింగపూర్, రష్యా, న్యూజిలాండ్‌తో పోలిస్తే చాలా మెరుగ్గా ఉందన్నారు.

పోర్టుల అభివృద్ధిలో లాజిస్టిక్స్ కీలకమైనదని పేర్కొంటూ.. జీడీపీలో 14శాతం కేవలం లాజిస్టిక్స్‌కే ఖర్చవుతుందని, 2030 నాటికి దీనిని సింగిల్ డిజిట్‌కు తేవాలనేదే 2022 లాజిస్టిక్స్ పాలసీ లక్ష్యాల్లో కీలకమన్నారు. ఇక రాష్ట్రం విషయానికి వస్తే... 1053 కి.మీ సముద్రతీరంతో కూడిన అపారమైన వనరులను వినియోగించుకునే విధంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన మారిటైమ్ పాలసీ 2024-29కి శ్రీకారం చుట్టిందన్నారు.

మారిటైమ్ పాలసీ 2024 -29 కీలకాంశాలు:

2030నాటికి భారత మారిటైమ్ గేట్ వేగా ఏపీని మార్చేందుకు వీలుగా పాలసీ కార్యాచరణ రూపొందింది. పాలసీ ప్రకారం ప్రపంచంలోని 20 భారీ పోర్టుల్లో ఒకటి ఏపీలో ఉండేలా సామర్థ్యం పెంచుకోనుంది. 2047నాటికి దేశంలోని పోర్టుల్లో నిర్వహిస్తున్న మొత్తం కార్గోలో 20 శాతం ఏపీలోనే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించడం జరిగింది. పోర్టు సంబంధిత వ్యవహారాల్లో 5వేలమంది నిపుణులను 2028 నాటికల్లా తయారు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. రాష్ట్రంలో మారిటైమ్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయనుంది. ఫిషింగ్ హార్బర్లు, పోర్ట్‌ల అభివృద్ధికి పీ4 మోడల్‌ను ప్రోత్సహించనుందని మంత్రి వివరించారు. సదస్సులో జరిగిన చర్చల ద్వారా ఈ రంగంలో ఉన్న విస్తారమైన అవకాశాలను, మరియు ప్రభుత్వం, పరిశ్రమలు, పెట్టుబడిదారులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడం జరిగింది. ఫలప్రదమైన చర్చల నుండి వచ్చిన విలువైన సూచనలకు, నూతన ఆలోచనలకు, నిర్మాణాత్మక అభిప్రాయాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం, లాజిస్టిక్స్ రంగంలో వ్యయాన్ని తగ్గించే విధంగా ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. భాగస్వామ్య పక్షాలనుంచి విలువైన సూచనల కోసం సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే సమయంలో ప్రవేట్ భాగస్వామ్యంపైనా చర్చించేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు.

## ఉర్దూ స్కూళ్ల పనివేళలు మార్పు

**ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు**
**ఈనెల 30 వరకూ అనుమతి**
**సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఫరూక్**



అమరావతి (చైతన్య రథం): రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలల పని వేళలు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. రంజాన్ పవిత్ర మాసంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులంతా సాయంత్రం పనివేళల ముగింపుకంటే ఒక గంట సమయం ముందుగానే బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గత నెలాఖరులోనే ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 3 నుంచి 30 వరకు ఉర్దూ విద్యాబోధన పాఠశాలల పని వేళలు మారుస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఉర్దూ మీడియం సమాంతర విభాగం మరియు ఉర్దూ మీడియం డైట్ కళాశాలలకు పనివేళల్లో మార్పు వర్తిస్తుందన్నారు. రంజాన్ మాసంలో ప్రభుత్వ శాఖల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులు మతపరమైన ఆచారాలు నిర్వహించుకోవడానికి గంటముందుగా బయటకు వెళ్లేందుకు అనుమతించే నిర్ణయం మరియు ఉర్దూ పాఠశాలల పనివేళల మార్పుపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముస్లిమ్ సమాజం తరపున మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



అమరావతి (చైతన్య రథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, బీసీ వెల్ఫేర్, చేనేత, జౌళి మంత్రి ఎస్ సవితతో కలసి సమీక్షా సమాశం నిర్వహించారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి ముఖ్యమంత్రి పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమంతోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్టు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో "లక్ పతి దీదీస్" పేరిట రాష్ట్రవ్యాప్తంగావున్న దాదాపు వంద మంది మహిళా వ్యాపారవేత్తలను సీఎం సత్కరిస్తారని ఆమె వెల్లడించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్షమందికి పైగా మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ అందజేసి, కుట్టుమిషన్లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మహిళల ఆర్థిక అభ్యున్నతికి ఉద్దేశింపబడిన ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో ప్రారంభిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన స్టాళ్లను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా మహిళలు నడుపుతోన్న ఆహార, గృహాలంకరణ మరియు చిరు ధాన్యాల ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఫ్లిప్‌కార్ట్, ఫార్మ్ వేద, మిల్లెట్ బ్యాంక్, హెర్బ్‌కార్న్ వంటి సంస్థలతో సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకోనున్నట్టు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వందమంది చేనేత మహిళా కళాకారులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబోతున్నట్టు తెలిపారు. చేనేత వస్త్రాలు, హస్తకళలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద దాదాపు 1300మంది అర్హులైన మహిళలకు రూ.1,300 కోట్ల మేర రుణాలు అందచేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయాలని, వారికి సీఎం చేతుల మీదుగా యూనిట్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని శాఖలకు సంబంధించి 15 స్టాళ్లను మాత్రమే ఏర్పాటు చేయాలని మంత్రి అనిత స్పష్టం చేశారు. మహిళా రక్షణకు శక్తి యాప్ రూపొందించామని, ఈ యాప్ మహిళా దినోత్సవం రోజున సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ డా.మల్లికార్జున, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్‌తో పాటు స్త్రీ, శిశు, గిరిజన, సాంఘిక, మైనారిటీ సంక్షేమం, పోలీస్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అట్టహాసంగా మహిళా ఉద్యోగుల**

## ఆటల పోటీలు ప్రారంభం

అమరావతి (చైతన్య రథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉద్యోగులతో నిర్వహించే ఆటల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలాపించారు. మహిళలే క్రీడలు ఏర్పాటు చేయడం ఆదర్శంగా ఉందని, శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మలకుమారి, కన్వీనర్ మాధవి, ఆల్ ఇండియా ఎన్ఈసీ మెంబెర్ శాంతి శ్రీ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు.. అసెంబ్లీ వదిలి గ్రౌండ్లోకి.. ఎప్పుడంటే?



ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ప్రస్తుతం జరుగుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుతో ఏపీ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. మండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య మాటల పోటీ నడుస్తోంది. అయితే ఇప్పుడు ఈ మాటల పోటీని వదిలి ఆటలపోటీకి వేళైంది. అదేంటని అనుకుంటున్నారా.. శాసనసభ్యులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించనుంది ఏపీ ప్రభుత్వం. ఈ మేరకు ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిర్ణయం తీసుకున్నారు. శాసనసభ్యులకు సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అయ్యన్నపాత్రుడు తెలిపారు. పురుషులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. అలాగే మహిళా శాసనసభ్యురాళ్లకు బ్యాడ్మింటన్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించనున్నారు. మార్చి 18,19,20వ తేదీలలో మూడు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన శాసనసభ్యులు చీఫ్ విప్‌లు, విప్‌లకు పేర్లు ఇవ్వాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. అయితే ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే శాసనసభ్యులకు కొంత ఆటవిడుపు కల్పించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. శాసనసభ్యులకు ఆటలపోటీలు నిర్వహించడం ద్వారా రోజువారీ కార్యకలాపాల నుంచి కాస్త విశ్రాంతి దక్కుతుందని భావిస్తున్నారు. అయితే ఈ పోటీలలో వైసీపీ శాసనసభ్యులు కూడా పాల్గొంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా తొలిరోజు గవర్నర్ ప్రసంగం జరిగింది. గవర్నర్ ప్రసంగం రోజున వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహా ఆ పార్టీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు. ఆ తర్వాత తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అయితే సభలో లేకపోయినా కూడా ప్రజా సమస్యలపై బయట పోరాటం చేస్తామని వైఎస్ జగన్ ప్రకటించారు. ప్రతిపక్ష హోదా ఇస్తే మరింత సమయం కేటాయించాల్సి వస్తుందనే కారణంతో వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని వైఎస్ జగన్ అప్పట్లో ఆరోపించారు. దీంతో అసెంబ్లీకి వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు జగన్ ప్రకటించారు. అయితే తాజాగా శాసనసభ్యులకు ఆటలపోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. వైసీపీ సభ్యులు ఇందులో పాల్గొంటారా.. లేదా దూరంగా ఉంటారా అనేది ఆసక్తికరంగా మారింది.

# డ్రగ్స్ నియంత్రణపై ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేస్తాం

విజయనగరం (చైతన్యరథం): మంగళవారం కలెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన జిల్లా డ్రగ్స్ నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ నియంత్రణపై ఫిర్యాదుల కోసం 1972 టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రజలు వినియోగించు కోవాలని అన్నారు. జూన్ నెలలోగా అన్ని స్కూళ్లు, కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణపై ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. గంజాయితో పట్టుబడితే తీవ్రమైన కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, ఇన్‌ఛార్జ్ జేసీ శ్రీనివాస్ మూర్తి, అదనపు ఎస్పీ సౌమ్యలత, తదితరులు పాల్గొన్నారు.

# జనరంజక బడ్జెట్‌పై విమర్శలు సిగ్గుచేటు



ఆమదాలవలస (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ జనరంజకంగా ఉండడాన్ని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు నూకరాజు, నందివాడ గోవిందరావు, కిల్లి సిద్ధార్థ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురై అతలాకుతలమైతే కొత్తగా ఏర్పడి న కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ధైర్యంతో రూ.3.24 లక్షల కోట్లతో పూ ర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇది అన్ని వర్గాలకు ప్రయోజనం కలిగించేలా ఉందని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే ఎటువంటి రాజకీయ అనుభవం లేని వైసీపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. టీడీపీ నాయకులు అప్పలనాయుడు, తంగి గురయ్య, జగన్నాథం, తాడేల వెంకటరమణ లావేటి పూర్ణారావు, నేతింటి జ్యోతి, అప్పలనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.


# పోలవరం ఎత్తు తగ్గింపు అవాస్తవం... అది వైసీపీ దుష్ప్రచారం మాత్రమే

## •45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మించి తీరుతాం : మంత్రి నిమ్మల పునరుద్ఘాటన



పాలకొల్లు (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే చేస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారానికి, ప్రజల్లో కల్పిస్తున్న గందరగోళానికి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నాటి శాసనమండలి సమావేశంలో ఘాటుగా సమాధానం ఇచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపునకు సంబంధించి వివరాలు వెల్లడించాలని కోరినప్పుడు మంత్రిపై విధంగా స్పందించారు. 2019 ఫిబ్రవరి 18న 55 వేల కోట్లకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీలో చంద్రబాబు ద్వారానే పోలవరం వ్యయం ఆమోదించారు. 2014 -19 మధ్యకాలంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఫేజ్ -1, ఫేజ్- 2 అని గాని, 41.15 మీటర్లు, 45.72 మీటర్లు అని గాని లేవన్నారు. అలాంటిదేమైనా ఉంటే చూపించాలని సవాల్ చేశారు. ఎత్తుకు సంబంధించి ఫేజ్-1, ఫేజ్-2 లు తెచ్చింది కూడా 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వమేనని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. 2020లో జగన్ పోలవరం కుడికాలువ నీటి సామర్థ్యాన్ని 17,560 నుండి 11650కు, ఎడమ కాలువ నీటి సామర్థ్యాన్ని 17,500 నుండి 8122 క్యూసెక్కులకు తగ్గించి ఉత్తరాంధ్ర రాయలసీమకు జగన్ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. 2019 -2024 మధ్య, వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రంతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల లేఖలను, జీవో ప్రతులను సభ ముందుంచి వైకాపా ఎమ్మెల్సీల అబద్ధపు ప్రచారాన్ని తిప్పి కొట్టారు. నోరు ఉంది కదా అని, ఏది పడితే అది మాట్లాడటం, అవినీతి పత్రిక ఉంది కదా అని అబద్ధపు రాతలు రాయడం, ఎంత మాత్రం మంచిది కాదన్నారు. గత సమావేశ కాలంలో కూడా పోలవరం ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి స్పష్టంగా సమాధానం చెప్పానని, వాస్తవాలు వివరించానని అయినా అవే అబద్ధాలను పదేపదే చెప్పడం, ప్రజలను ఏ మార్చాలని చూడటం వారి మూర్ఖపు వైఖరికి నిదర్శనం అన్నారు. 2019 నాటికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేసిందని చెప్పారు. 2019-24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం చేసింది కేవలం రెండు శాతం మాత్రమేనని, ఈ వాస్తవాలను గణాంకాలను, నేను చెప్పడం లేదని రికార్డులే చెబుతున్నాయని మంత్రి నిమ్మల వివరించారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకు సంబంధించి సుమారు 90 వేల కుటుంబాలు ఉండగా 12,000 కుటుంబాలకు పునరావాసం కల్పించామని, అలాగే గత తెలుగుదేశం ప్రభుత్వంలో వారికి ఆనాడు 2017లో 830 కోట్లకు పైగా పరిహారం అందించామని, మరలా నేడు 990 కోట్లు ఇవ్వడం జరిగిందని మంత్రి చెప్పారు. నిర్వాసితులకు పైసా కూడా ఖర్చు పెట్టని ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది వైసీపీ మాత్రమేనని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనేది మా అధినాయకుడైన చంద్రబాబు లక్ష్యమని మంత్రి రామానాయుడు మరోసారి పునరుద్ఘాటించారు. నదుల అనుసంధాన ప్రక్రియలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ఇటు ఉత్తరాంధ్రకు అటు రాయలసీమకు పూర్తిస్థాయిలో నీరు అందిస్తామని మంత్రి రామానాయుడు మరోసారి స్పష్టం చేశారు.

# టెన్త్ హాల్ టికెట్లు విడుదల... నేరుగా వాట్సప్‌లో డౌన్‌లోడ్




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే. తాజాగా పాఠశాల విద్యాశాఖ ఈ పరీక్షల హాల్ టికెట్లను జారీ చేసింది. అయితే ఇంటర్మీడియట్ హాల్ టికెట్ల మాదిరి టెన్త్ హాల్ టికెట్లను కూడా వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా హాయ్ అని మెసేజ్ పెట్టిన తర్వాత సేవలను ఎంచుకొని, హాల్ టికెట్ పొందవచ్చని ఆయన సూచించారు. అలాగే పాఠశాల లాగిన్ ద్వారా అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా హాల్‌టికెట్లు పొందవచ్చని తెలిపారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఫీజు చెల్లించలేదని హాల్ టికెట్లు నిలిపివేస్తున్నట్లు గతంలో పలుమార్లు ఫిర్యాదులు అందాయి. ఈసారి ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం నేరుగా విద్యార్థుల మొబైల్ ఫోన్లకు నేరుగా హాల్ టికెట్లను పంపించి, అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా షెడ్యూల్ ప్రకారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఇప్పటికే విద్యాశాఖ పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. సైన్స్ పేపర్లకైతే ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

**ఏపీ టెన్త్ 2024 పబ్లిక్ పరీక్షల పూర్తి షెడ్యూల్ ఇదే..**

మార్చి 17, 2025 (సోమవారం) ఫస్ట్ ల్యాంగ్వేజ్, ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపర్ 1 పరీక్ష

మార్చి 19, 2025 (బుధవారం) సెకండ్ ల్యాంగ్వేజ్ పరీక్ష

మార్చి 21, 2025 (సోమవారం) ఇంగ్లిష్ పరీక్ష

మార్చి 22, 2025 (శుక్రవారం) ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపర్ 2, OSSC మెయిన్ ల్యాంగ్వేజ్ పేపర్ 1

మార్చి 24, 2025 (సోమవారం) మ్యాథమెటిక్స్ పరీక్ష

మార్చి 26, 2025 (బుధవారం) ఫిజికల్ సైన్స్ పరీక్ష

మార్చి 28, 2025 (శుక్రవారం) బయోలాజికల్ సైన్స్ పరీక్ష

మార్చి 29, 2025 (శనివారం) OSSC మెయిన్ ల్యాంగ్వేజ్ పేపర్ 2, OSSC ఒకేషన్ కోర్సు

మార్చి 31 లేదా ఏప్రిల్ 1, 2025 (సోమవారం లేదా మంగళవారం) సోషల్ స్టడీస్ పరీక్ష

# పుష్కర ఘాట్‌లో పడవ బోల్తా... ఇద్దరి మృతి



రాజమండ్రి పుష్కర ఘాట్ దగ్గర ఘోర ప్రమాదం జరిగింది. పుష్కర ఘాట్ గోదావరి నది మధ్యలో బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు చెవల అన్నవరం, గాడా రాజు మృతి చెందారు. మృతదేహాలను బయటకు తీసిన పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు., వివరాల్లోకి వెళితే.. గోదావరి నది మధ్యలో ఉన్న బ్రిడ్జి లంకకు12 మంది పడవలో వెళ్లారు. రాత్రి సమయంలో పడవలో తిరిగి వస్తుండగా రెండు వంతెనల మధ్యలో పడవలోకి నీరు చేరింది. దీంతో పడవ మునిగిపోయింది. పడవలో ఉన్న ఇద్దరు నీటిలో మునిగిపోగా.. 10 మంది ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. లంకల్లోకి నాటుపడవల్లో మందు పార్టీలకు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఎటువంటి భద్రత ప్రమాణాలు లేకుండా మత్స్యకారులు 24 గంటల పాటు గోదావరిలో నాటుపడవలు నడుపుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు గోదావరి తీరంలో ఉన్న లంక గ్రామాలు అడ్డాగా మారాయి. రాజమండ్రి పుష్కర ఘాట్‌లో మునిగిపోయిన నాటుపడవను బయటకు తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నీటిలో ఊబిలో నాటుపడవ కూరుకుపోయింది. వారిలో బోటు నడిపే మత్స్యకారుడు కూడా ఉన్నాడు. నాటుపడవలో వారు రాజమండ్రి శివారు సింహాచల్ నగర్, భవానీ పురం ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్రాన్ని దివాళా తీయించిన వ్యక్తి జగన్ : జీవీ ఆంజనేయులు



అమరావతి / వినుకొండ (చైతన్యరథం): అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని లూటీ చేసిన సంపదతో జగన్ లక్షల కోట్ల రూపాయలకు పడగలెత్తారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారమే 2004లో కేవలం రూ.2 కోట్ల ఆస్తులున్న వ్యక్తి ఇప్పుడు 50 కంపెనీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలా అధిపతి అయ్యారని, ఇంత సంపద ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరో ధ్యాస లేకుండా సంపద సృష్టి ఊసు లేకుండా రాష్ట్రాన్ని దివాళా తీయించిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంగళవారం తన ప్రసంగంలో ఈ మేరకు జగన్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, కాంట్రాక్టర్లకు రూ. లక్షా 40వేల కోట్లు పెండింగ్ పెట్టారని ఆ డబ్బంతా ఏం చేశారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల మొదలు కోడిగుడ్లు, చిక్కీల వరకు వేలు, వందల కోట్లు పెండింగ్ పెట్టారని వాపోయారు. సంక్షేమానికి 2.7 లక్షల కోర్చు పెట్టామన్నారు సరే... తెచ్చిన అప్పుల్లో మిగిలిన డబ్బులు ఏమయ్యాయో చెప్పాలన్నారు. జగన్ చేసిన అప్పుల ఫలితంగా అసలు వడ్డీకి కలిపి ఏడాదికి రూ.60 వేల కోట్లు కట్టాల్సి వస్తోందని, ఎక్కడ రాష్ట్రానికి అప్పులు పుట్టని పరిస్థితులు తెచ్చారన్నారు. అలాంటి విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేసేలా బడ్జెట్ పెట్టడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చేయూతనిచ్చేలా, రైతేరాజు అన్న మాటను నిజం చేసేలా కేటాయింపులు చేశారన్నారు. 5ఏళ్ల వైసీపీ పాలనలో ప్రాజెక్టులన్నీ అటకెక్కాయని, కూటమి వచ్చాకే మళ్లీ అభివృద్ధిని పట్టాలెక్కిస్తున్నామన్నారు. అయిదేళ్లు అమరావతిలో తట్ట మట్టి వేయని జగన్ పోలవరాన్ని కూడా అలానే బలిపెట్టాలని చూశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మళ్లీ కేంద్రం నుంచి అమరావతి, పోలవరానికి నిధులు తీసుకు వచ్చి పనులు ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. రహదారులపై గుంతలు పూడ్చడం 80% పూర్తయిందన్న జీవీ... అవే పనులు వైసీపీ హయాంలో ఎందుకుచేయలేదో చెప్పాలన్నారు. వైసీపీ 5 ఏళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన లక్షా 14వేల కోట్లు పక్కదారి పట్టించడం దుర్మార్గమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పిల్లలు చదువుకోవడానికి కనీస వసతుల్లేకుండా చేశారని, బీసీ, ఎస్సీ హాస్టళ్లను గాలికి వదిలేశారని అన్నారు. జగన్ జల్సాలకు మాత్రం వందల వేల కోట్లు దుబారా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్ను, పేపర్లకు రూ.9.74కోట్లు తగలేశారని, ప్యాలెస్‌కు ఇనుప ఫెన్సింగ్ కోసం 12.5 కోట్లు ఖర్చు చేశారన్నారు. సర్వేరాళ్ల మీద ఫోటోలు వేసినందుకు 700కోట్లు పెట్టారని ఆలానే ఫోటోల పిచ్చికి వేల కోట్లు ఖర్చు చేశారు గానీ విద్యార్థుల చదువుల పట్టించుకోలేదన్నారు. నాసిరకం మద్యం వల్ల 35 లక్షల మంది అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవడం పట్టించుకోలేదన్నారు. ఇంకా సిగ్గు లేకుండా 30ఏళ్లు ఉంటామంటున్నారని. 151 నుంచి 11కి పడేసిన బుద్ధి మారలేదన్నారు. ఇంకా ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నారు? అని జీవీ ఆంజనేయులు నిలదీశారు.

# మహిళా విభాగం క్రీడాపోటీలు ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్



విజయవాడ (చైతన్యరథం): అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉద్యోగులతో నిర్వహించే ఆటల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలాపించారు. మహిళ మూర్తులు ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయంగా ఉందని, శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల కుమారి, కన్వీనర్ మాధవి గారు, ఆల్ ఇండియా ఎన్ ఈసీ మెంబెర్ శాంతిశ్రీ, మహిళ ప్రతినిధులు శివలీల, విజయశ్రీ, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్2 అధ్యక్షుడు ఎం రాజబాబు, ఏపీ ఎన్జీవో నగర శాఖ అధ్యక్షులు సి వి.ఆర్ ప్రసాద్ ఉన్నారు.

# ఆలపాటి గెలుపు ప్రజా విజయం : యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): కృష్ణ-గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ 82 వేల 320 ఓట్ల మెజార్టీతో అఖండ విజయం సాధించడం పట్ల ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపును ప్రజల గెలుపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, "ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు టీడీపీ పై పట్టభద్రులకు ఉన్న అభిమానం, నమ్మకానికి ప్రతీక అని అభివర్ణించారు. ఈ విజయం కూటమికి మరింత బలాన్ని తీసుకొస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మేలు చేసే నాయకత్వానికి ప్రజలు తగిన గుర్తింపు ఇస్తారని మరోసారి రుజువైంది" అని అన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలను పట్టభద్రుల తిప్పికొట్టారని అన్నారు. ప్రగతికి, అభివృద్ధికి ఓటు వేయండని చెప్పామని, ఆ మేరకు విద్యావంతులు ఓట్లు వేశారని వివరించారు. ఈ ఘన విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్త, నేతలకు అభినందనలు తెలిపారు.

# అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏసీఏ - వీడీసీఏ స్టేడియం సిద్ధం

విశాఖపట్నం (చైతన్యరథం): ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెలలో జరగబోయే రెండు ఐపీఎల్ మ్యాచులు వైజాగ్‌కి గర్వకారణంగా నిలిచేలా నిర్వహిస్తామని ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. ఐపీఎల్ మ్యాచుల వివరాలు, ఈ మ్యాచ్ నిర్వహించేందుకు చేపట్టిన ఆధునీకరణ పనులు తెలియజేసేందుకు మంగళవారం వైజాగ్‌లోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ప్లానింగ్ అండ్ ప్రిపరెడ్నెస్ మీట్ జరిగింది. అనంతరం గ్రౌండ్‌లో చేపట్టిన ఆధునీకరణ పనులు పరిశీలించారు. అనంతరం ప్లానింగ్ అండ్ ప్రిపరెడ్నెస్ మీట్ లో ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఈ మ్యాచులు నిర్వహించేందుకు సహకరించిన బిసిసిఐ వారికి, వైజాగ్ స్టేడియం హోమ్ గ్రౌండ్‌గా ఒప్పుకున్నందుకు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్య సంస్థ జిఎమ్ఆర్ గ్రూప్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ స్టేడియంలో మార్చి 24న తలపడనున్న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్‌తో, మార్చి 30న ఆడనున్న ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడుతుందన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ హోమ్ గ్రౌండ్‌గా విశాఖ స్టేడియంను సిద్ధం చేసినట్లు ప్రకటించరు. ఢిల్లీ క్యాపిటల్స్‌ను వైజాగ్‌లో మ్యాచులు ఆడేందుకు చాలా కష్టపడి ఒప్పించినట్లు తెలిపారు.



# కూటమి ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు ప్రజా విజయం

**●రాజేంద్రప్రసాద్, రాజశేఖర్ విజయం కూటమి ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం : ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): "కూటమిప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం తగ్గలేదని చెప్పడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే నిదర్శనం. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాజశేఖర్ విజయం సాధించడం సంతోషంగా ఉంది. 82వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆలపాటికి పట్టభద్రులు పట్టం కట్టడం.. ప్రభుత్వంపై వారికున్న అచంచల నమ్మకాన్ని తెలియచేస్తోంది. పెద్దల సభలో ఆలపాటి ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తాడని నమ్ముతున్నాం. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూటమి బలపరిచిన శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్ర అభ్యర్థిగా గెలిచిన రాజశేఖర్‌కు అభినందనలు. బ్యాలెట్ ఓటింగ్ లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధించడం, పట్టభద్రులు తమ ప్రభుత్వాన్ని ఎంతగానో ఆదరించడం శుభపరిణామం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆలపాటి రాజాకి అభినందనలు తెలిపిన సాయి కళ్యాణి



హనుమాన్‌జంక్షన్(చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడం పట్ల తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి కళ్యాణి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా విజయం సాధించి చట్టసభలో అడుగుపెడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మంగళవారం నాడు గుంటూరులోని ఆయన నివాసంలో పూల మొక్కను అందజేసి సాయి కళ్యాణి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా సాయి కల్యాణీ మాట్లాడుతూ, గత 6 నెలలు నుంచి ఆలపాటి రాజా పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమంతో మొదలుకుని అన్ని వర్గాలు, రంగాల ప్రజలను నిత్యం కలుస్తూ, వారితో మమేకై సమస్యలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి మద్దతుగా నిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబునేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మద్దతుగా నిలిచిన విద్యావంతులు, మేధావులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మరోసారి పట్టం కట్టారని సాయి కళ్యాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే చేపట్టిన అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటుందనడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడమే నిదర్శనమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీలుగా అఖండ విజయం సాధించిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తారని సాయి కల్యాణీ తెలిపారు.

# 2047 విజన్‌కు తగిన విధంగా రాష్ట్ర బడ్జెట్

**●అంకెల గారడితో ప్రజలను మోసం చేసిన వైసీపీ : గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): 2047 విజన్‌కు తగిన విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొని బడ్జెట్‌పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రసంగించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని, రాష్ట్రాన్ని వైసీపీ తన అసమర్థతతో అప్పుల ఊబిలోకి నెట్టేసిందన్నారు. ఈ క్లిష్ట సమయంలో 10 సూత్రాలతో 2047 విజన్ పెట్టుకోవడం అంటే ఓర్పు నేర్పు శ్రమతో కూడుకున్న ప్రయాణమని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2047 విజన్‌కు తగిన విధంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తూ 31,805 కోట్లు పాఠశాల విద్యకు, రూ.2506 కోట్లు ఉన్నత విద్యకు కేటాయించడం భావితరాలకు బాటలు వేయడమేనన్నారు. రూ.19,264 కోట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమానికి కేటాయిస్తూ ప్రతి కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య భీమా కేటాయించడం చంద్రబాబు పరిపాలన దక్షతకు అద్దం పడుతుంది. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను అణచివేసిందని, కానీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రూ.47,450 కోట్లు కేటాయించి ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. గతంతో పోల్చుకుంటే అన్ని రంగాల్లో బలోపేతం చేస్తూ రూ.3,22,350 కోట్లతో రూపొందించిన ఈ బడ్జెట్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆలోచన సమర్థతకు ప్రతిబింబంగా కనిపిస్తుందన్నారు.

# చంద్రగిరిలో పోటీ చేస్తా..చెవిరెడ్డిని ఓడిస్తా!

## చంద్రగిరి ఎమ్మెల్యే పలివర్తి నానీ సతీమణ సుధారెడ్డి సవాల్ కిరాతకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి

చంద్రగిరి, (చైతన్యరథం) : వచ్చే ఎన్నికలలో చంద్రగిరి నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఓటిస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణ సుధారెడ్డి సవాల్ విసిరారు. అక్రమాలకు చిరునామాగా మారిన చెవిరెడ్డి తనపై ఆరోపణలు చేయడంపై సుధారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల నాటికి చంద్రగిరి రెండు స్థానాలుగా మారుతుందన్నారు. ఖచ్చితంగా చెవిరెడ్డి మీద తాను పోటీ చేస్తానన్నారు. సీఎం చంద్రబాబు ఖచ్చితంగా మహిళగా తనకు అవకాశం కల్పిస్తారని ధీమా వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో వెంట వచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు అనుచరులతో కలిసి చంద్రగిరి టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచే చెవిరెడ్డికి బహిరంగంగా ఫోన్ చేశారు. ఫోన్‌లోనే చెవిరెడ్డిని కడిగి పారేశారు. అవినీతి చేసిన చెవిరెడ్డి చట్టప్రకారం జైలు పోతాడన్నారు. గత ఐదేళ్ళుగా ఆడవాళ్లను అవమానిస్తూ వైసిపి రాజకీయం చేసింది వైసీపీయేనన్నారు. ఎమ్మెల్యే నానీని ఎదుర్కొనే



దైర్యం లేక తన మీద ఆరోపణలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. చెవిరెడ్డి, అతని భార్య అక్రమ ఆస్తుల వివరాలను కరపత్రాల్లో ముద్రించి ఇంటింటికీ పంచుతానన్నారు. వైసీపీ సోషల్ మీడియాలో తనమీద దుష్ప్రచారం చేసిన చెవిరెడ్డిని వదిలి పెట్టనన్నారు. యాబై లక్షలు లంచం తీసుకున్నానని ఆరోపణలు చేయడం కాదని ఆధారాలు ఉంటే బయట పెట్టాలని చెవిరెడ్డికి సవాలు విసిరారు. ఐదేళ్ళుగా మఠం భూములను చెవిరెడ్డి దోచుకున్నాడన్నారు. మగవాళ్ళు మగవాళ్లతో పోరాటం చేయాలన్నారు. నానీతో పోటీ పడలేక మహిళనైన తనపై నామీదా ఆరోపణలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల అఫిడవిట్లో చెవిరెడ్డి ఆస్తులను తప్పుగా చూపించాడన్నారు. ఇక నుండి చెవిరెడ్డి అవినీతిపై పోరాటం చేస్తానన్నారు. ముప్పై సంవత్సరాలుగా చంద్రగిరి గెలవకపోయినా నియోజకవర్గ కార్యకర్తల పార్టీ కోసం పనిచేశారన్నారు. సీఎం చంద్రబాబు పెట్టిన బిక్షతో చెవిరెడ్డి కొడుకు బయట తిరుగుతున్నాడన్నారు. చెవిరెడ్డి లెక్కల మొత్తం ఆధారాలతో బయటకు తీస్తామన్నారు. చెవిరెడ్డిని అరెస్టు చేస్తే....పోలీస్ స్టేషను ముందు దొర్లడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. గంజాయి అమ్ముకునే చెవిరెడ్డి కి... నిజాయితీగా ఉన్న మాకు పోలీకా అని నిలదీశారు. తుడా నిధులతో వేయించిన చెవిరెడ్డి పేర్లు పూర్తిగా తుడిచేస్తానన్నారు. ప్రజలకు కుక్కర్లు ఇచ్చి డబ్బు ఎవరిదో తేసుస్తామన్నారు. గంజాయి అమ్మింది కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నానీని చంపాలని కుట్ర పన్నిన కిరాతకుడు చెవిరెడ్డి అని విరుచుకుపడ్డారు. హత్య రాజకీయాల చేసేచెవిరెడ్డి వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. చెవిరెడ్డి అక్రమాలపై విజిలెన్స్ విచారణ సాగుతోందన్నారు.




# అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

దర్శి, (చైతన్యరథం): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతు న్నారని ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు తమలాంటి మహిళా డాక్టర్లు సమాజంలో గౌరవప్రదంగా ఉన్నారన్నారన్నారు. వర్తమానంలో డాక్టర్లను చూస్తే మహిళలే ఎక్కువమంది వైద్య వృత్తి వైపు పయనిస్తున్నారన్నారు. అదేవిధంగా సాఫ్ట్వేర్ రంగంలో ఇతర సాంకేతిక రంగాలలో మహిళలు పురుషులతో పోటీపడి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. క్రీడలలో పీవీ సింధు వంటి అనేకమంది ప్రపంచంలో గుర్తింపు పొందారన్నారు. కూటమి ప్రభుత్వం కూడా మహిళల ఆర్థిక అభివృద్ధికి వారి నైపుణ్యతకు ఎంతో సహకరిస్తోందన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తూ వారిని ఆర్థిక శక్తిగా ఎదిగి విధంగా కుటుంబంలో మహిళల గౌరవాన్ని పెంచేందుకు కృషి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కృషితో మహిళల అభివృద్ధికి అనేక పథకాలను ముందుకు తీసుకెళ్లగలుగుతు న్నామన్నారు. వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా అండదండగా ఉంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల భద్రత రక్షణ తోపాటు ఆర్థిక అభివృద్ధికి నైపుణ్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని డాక్టర్ గొట్టిపాటి వివరించారు.

# ఇది వివేకవంతులు కూటమికిచ్చిన బహుమతి



తిరుపతి, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ విజేతలకు అభినందనలు తెలుపుతూ కార్యాలయం ఎదుట తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కుటమి ప్రభుత్వానికి తిరుగులేని విజయాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరలా ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అహర్నిశలు తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడుతున్న

**ఇది వివేకవంతులు కూటమికిచ్చిన తీర్పు**

**టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు యాదవ్**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్డీఏ బలపరిచిన ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లా పట్టబద్రులు ఎమ్మెల్సీ తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరా బత్తుల రాజశేఖరం, కూటమి బలపరిచిన పిఆర్‌టియూ అభ్యర్థి గద్దె శ్రీనివాసులు నాయుడు భారీ మెజారిటీతో గెలుపొందడం తెలుగుదేశం పార్టీకి శుభ పరిణామమన్నారు. ఎమ్మెల్సీ విజేతలు ముగ్గురికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం పై పెట్టుకున్న నమ్మకాన్ని మరలా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తేటతెల్లమయిందన్నారు. ఇకనైనా వైసీపీ ఘోర పరాజయం కి కారణాలు తెలుసుకొని ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలు ఆకాంక్షలను నెరవేరుస్తూ ముందుకు సాగుతోందిదన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి యశ్వంత్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ చెంగయ్య, ఎస్సీ సెల్ మురళి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం..

# చదువుల తల్లికి నీరాజనం!

దర్శి, (చైతన్యరథం): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా చదువుకునే ప్రతి విద్యార్థికి ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఒక్కొక్కరికీ రూ. 15000 చొప్పున తల్లికి వందనం పథకాన్ని ద్వారా నగదు జమ చేయనున్నారు. ఈ పథకం మే నెలలో అమలు చేస్తున్నట్లు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు శాసనమండలిలో ప్రకటించారు. అందరి తల్లుల్లో ఆనందాన్ని నింపారు తల్లివందనం పథకం అమలుకు బడ్జెట్లో 9407 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఈ సందర్భంగా గౌరవ మంత్రి వెల్లటించారు. ఈ పథకాన్ని మే నెల నుండి ఆయా విద్యార్థుల కు జమ చేస్తున్నట్లు కూడా తెలియజేస్తూ త్వరలో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇలా ఇచ్చిన హామీల అమలుకు మన కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజా పాలనను అందిస్తుందని దర్శి నియోజకవం టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివరించారు. ఈ పథకం అమలు విషయంలో మంత్రి లోకేశ్ తీసుకున్న నిర్ణయం అమలుకు జరిపిన కసరత్తు ప్రశంసనీయమన్నారు.

# కూటమి పాలనలో


# ఏపీ ప్రజలకు మంచి రోజులు



అమరావతి, (చైతన్యరథం): అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సుదీర్ఘంగా విశ్లేణణాత్మకంగా మాట్లాడారు.బడ్జెట్ అంటే ఒక ఆర్థిక క్రమశిక్షణ, రాబడి ఖర్చులను అంచనా వేసుకుని ప్రభుత్వం నడపడం సామాన్యులకు అర్థమయ్యేలా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సాధ్యమయిందన్నారు. గత ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపులకు, ఖర్చులకు సంబంధం లేకుండా పోయిందన్నారు. ఐదు కోట్ల మంది ప్రజలు ఎన్నుకున్న సభ్యులు అసెంబ్లీ సాక్షిగా ఆమోదించే బడ్జెట్‌ను గౌరవించడం మొదటి నుంచి సంప్రదాయంగా వస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ వంటి కీలకశాఖలకు మూతవేయడం చూశామన్నారు.ప్రస్తుత మన కూటమి ప్రభుత్వంలో రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపడం శుభపరిణామమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ లో రూ.48341 కోట్లు కేటాయించడం సంతోషదాయకమన్నారు. సేద్యానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.12773 కోట్లు కేటాయించడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో15 శాతం వార్షిక వృద్ధికి కార్యాచరణ రూపొందించడం గొప్పవిషయమని పేర్కొన్నారు. 65 శాతం జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడివున్నారన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.6 వేలు ఇస్తే, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు కలిపి రైతులకు రూ.20 వేలు ఇవ్వబోతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే ఆర్నెళ్లకు పైగా డబ్బులు రాక రైతులు నలిగిపోవడం చూశామన్నారు. రైతులకు అండగా నిలిచి అనేక సార్లు నిరసన తెలిపాం. అయినా అప్పటి ప్రభుత్వం నుంచి స్పందన కరువయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లు కొత్త రూపు సంతరించుకుంటున్నాయని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. 2014-19 మధ్య కాలంలో రాష్ట్ర విభజనతో వెంటాడుతున్న కష్టాల మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి 63 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. పెరిగిన ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం 2019-24 మధ్య 80 వేల కోట్లకు పైగా ఖర్చుపెట్టాల్సివుంటే కేవలం రూ.22 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ఖర్చుపెట్టిన ఆ నిధుల విషయంలో అనేక అక్రమాలకు పాల్పడి రైతులకు తీరని ద్రోహం చేశారు. కాలువల్లో పూడిక తీయకుండానే తీసినట్టు చూపి బిల్లులు చేసేసుకున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమల్లించారు. సంక్షేమ కార్పొరేషన్ల ఉనికే లేకుండా చేశారన్నారు. వారు చెప్పినవన్నీ అమలు చేశారంట..కూటమి ప్రభుత్వం చేయడం లేదంట అని ఎద్దేవా చేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధం విధించాడా, వారంలో సీపీఎస్ రద్దు చేసి పడేశాడా,.. ఏటా జాబ్ కాలెండర్ విడుదల చేశాడా.. ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ పోస్టులు భర్తీ చేశాడా.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేశాడా.. మూడు రాజధానులు కట్టేస్తానన్నాడు..కట్టేశాడా.. వీటన్నింటి సంగతేమో కానీ 50 మందికిపైగా వైసీపీ బిడ్డలను సలహాదారులను నియమించి కేబినెట్ ర్యాంకులిచ్చి ప్రజల సొమ్ముతో సకల సౌకర్యాలు కల్పించారన్నారు. 50 మందికి పైగా సలహాదారులు ఇచ్చిన సలహాలతో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 11 సీట్లు తెచ్చుకున్నారన్నారు. ప్రజల సొత్తును విచ్చలవిడిగా ఖర్చుపెట్టి రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థను రివైవల్ చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్ లో 18 వేల కోట్లు కేటాయించారు..పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమకు పండగేనన్నారు. గోదావరి జలాలు కృష్ణా డెల్టాకు, కృష్ణా జలాలు రాయలసీమకు వస్తే ఆ ప్రాంతమంతా సస్యశామలంగా మారుతుందని వెల్లడించారు. మొన్నటి దాకా రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతి పూర్వవైభవం దిశగా సాగుతోంది. మంత్రి నారాయణ ఆ విషయంలో అహర్నిశలు శ్రమిస్తున్నారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు, రియల్ హీరో పవన్ కళ్యాణ్, యువకుడైన నారా లోకేష్ బాబుతో పాటు బీజేపీ సహకారంతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నాను.

# సీఎం దృష్టికి సీమ కష్టాలు

## నీటి సమస్యలన్నీ పరిష్కరిస్తానని పరిటాలకు చంద్రబాబు హామీ, అమరావతిలో భేటీ



రాప్తాడు, నియోజకవర్గంలోని సాగు, తాగునీరు, రైతుల సమస్యల్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అమరావతికి వెళ్లిన ఎమ్మెల్యే సునీత మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. నియోజకవర్గంలో ప్రధానంగా హంద్రీనీవా ద్వారా నీరందించే అంశం గురించి చర్చించారు. హంద్రీనీవా 2వదశలో కాల్వకు లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. లైనింగ్ పనులు చేస్తే రాప్తాడు నియోజకవర్గంలో 38చెరువులకు నీరందే అవకాశం లేదని, భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలని, కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా రాప్తాడులో 70వేల ఎకరాలకు పైగా హంద్రీనీవా పరిధిలో ఆయకట్టు ఉందన్నారు. ఇప్పటి వరకు డిస్ట్రిబ్యూటరి సిస్టమ్ లేనందున తాత్కాలికంగా హంద్రీ నీవా నీటిని కాలువ ద్వారా చెరువులకు సరఫరా చేస్తున్నారు. ఆయకట్టును స్థిరీకరించి.. పంట కాలవల అభివృద్ధి చేస్తే భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. దీని వలన పరోక్షంగా మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. కావున మా విన్నపాన్ని పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. మరోవైపు జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే అంశాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2018లో అప్పట్లో చంద్రబాబు మీద నమ్మకంతో భూములిచ్చిన రైతుల్లో చాలా మందికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు. ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ రూ.14.50 కోట్ల నిధులు విడుదల చేసి.. పనులను పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అన్ని అంశాల మీద ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని చెరువులకు నీరందించే విషయంలో రాజీ ఉండదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.



ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళవారం విజయవాడలో కడప ఎంఎల్ఏ ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఆదోనిలో వైసీపీకి అధోగతి

## 20 కుటుంబాలు టీడీపీ లో చేరిక

ఆదోని, (చైతన్యరథం): నియోజకవర్గం కప్పగల్లు గ్రామం నుండి మంగళవారం ఉమాపతి నాయుడు సమక్షంలో కప్పగల్లు వైసీపీ నేతలు, 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో రారు. చేరిన వారిలో కరగేని తిమ్మప్ప, ఓబులేష్, వెంకటేష్, కరగేని మల్లి, కరగేని మునిస్వామి, తిమ్మప్ప, తిరుమల, పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కుప్పగల్ గ్రామ నాయకులు షణ్ముఖ, పి వెంకటేష్,కే అయ్యప్ప రెడ్డి, కే తిమ్మారెడ్డి, రామకృష్ణ, శేఖర్, ఎం రామకృష్ణ ఉన్నారు. టిడిపి నాయకులు రంగన్న, కృష్ణారెడ్డి, అయ్యన్న, గనేకల్ విరుపాక్షి, తాయప్ప, రంగస్వామి పాలొన్నారు.





# బాబా శత జయంతోత్సవాలకు రండి

## కెనడా మాజీ మంత్రికి ఎమ్మెల్యే పల్లె ఆహ్వానం

పుట్టపర్తి, (చైతన్యరథం): కెనడా సాంస్కృతిక భౌగోళికా మహిళా సాధికారత మాజీ మంత్రి లీల సాహిర్ అహమద్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతి అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంగళవారం అసెంబ్లీ హాల్‌కు విచ్చేసిన కెనడా సాంస్కృతిక మహిళా సాధికారత మాజీ మంత్రి లీల సాహిర్ అహమద్‌ను ప్రత్యేకంగా కలిశారు. సందర్భంగా కెనడా మాజీ మంత్రిని పుట్టపర్తి



సాయిబాబా దర్శనార్థం రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వచ్చే నవంబర్‌లో జరిగే భగవాన్ సత్యసాయి బాబా 100వ శత జయంతోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రపంచవ్యాప్తంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మానవాళికి అందిస్తున్న వైద్యం, విద్య, త్రాగునీటి వంటి సేవలను ఎమ్మెల్యే కెనడా మాజీ మంత్రికి వెల్లడించారు. పుట్టపర్తి ప్రాంతానికి తప్పకుండా విచ్చేస్తానని సత్యసాయిబాబా అంటే తనకు ఎంతో ఇష్టమని కెనడా మాజీమంత్రి ఎమ్మెల్యేకి చెప్పారు.

# ఎన్నికల ఫలితాలపై వైసీపీ అవాస్తవ ప్రచారం

## ఎమ్మెల్సీ ఎన్నికల పరిణామాలపై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందన

అనంతపురం, (చైతన్యరథం): దాదాపు 9 నెలల కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నారని ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యావంతులు సానుకూలంగా ఉన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే అని ఆయన వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కూటమి మద్దతిచ్చిన అభ్యర్థులు ఐదు చోట్ల గెలవడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో దేశంలోనే రికార్డు స్థాయి మెజారిటీలతో ఘనవిజయం సాధించడాన్ని బట్టి తెలుగుదేశం ప్రభుత్వంపై మేధావి వర్గం ఎంత సంతృప్తిగా ఉందనేది అర్థమవుతోందన్నారు. గత కొన్ని రోజులుగా వైసీపీ నాయకులు ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని ప్రచారం చేస్తున్నారని అయితే తాజాగా వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వారికి చెంప పెట్టులాంటివన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పోటీలో లేకపోయినా, పీడీఎఫ్ అభ్యర్థుల కోసం పనిచేయాలని ఆ పార్టీ అధిష్టానం ఆదేశించింది. తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు కృష్ణా, గుంటూరులో వైసీపీ శ్రేణులు పీడీఎఫ్ అభ్యర్థుల కోసం పని చేశారని.. కానీ వైసీపీ ప్రచారం చేయడం వలన వారికి మరింత నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పనితీరుపై పట్టభద్రులు సంతృప్తితో



ఉండటంతోనే తొలి ప్రాధాన్యత ఓటుతోనే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజా గెలుపొందినట్లు చెప్పారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానంలోనూ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ ఆధిక్యాన్ని సాధించారన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తన చేతుల్లోకి తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గాడిలో పెట్టడానికి 9నెలలుగా శ్రమిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం ముందువరుసలో ఉందన్నారు. కానీ వైసీపీ మాత్రం ప్రభుత్వంపై అసంతృప్తి అంటూ వాస్తవ దూరమైన ప్రచారం చేసిందన్నారు. ఇప్పుడు పట్టభద్రులు కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఈ ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఉత్తరాంధ్ర నియోజకవర్గం ఎన్నికల బరిలో టీడీపీ లేదని.. రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు ఇద్దరికీ మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లు వేయాలని వేలాదిమంది టీడీపీ కేడర్‌కు టెలికాన్ఫరెన్స్ ద్వారా మా అధినేత చంద్రబాబు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఎవరు గెలిచినా మనం మద్దతు ఇచ్చిన వారే అని స్పష్టం చేశారన్నారు. ఈ ఫలితాలతో వైసిపి వెన్నులో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# వంతారాలో సింహం పిల్లలతో మోదీ..

వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రం వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. ఇవాళ జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఎమ్మార్ఐ, సీటీ స్కాన్‌లు, ఐసీయూలు మొదలైన వాటితో కూడిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు, జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ప్రధాన లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేశారు. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.



# లైట్ తీస్కోండి

## స్కూళ్లలో విద్యార్థుల ఫోన్ వినియోగంపై నిషేధం సాధ్యం కాదు: ఢిల్లీ హైకోర్టు



పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులు స్మార్ట్ ఫోన్లను వినియోగించడాన్ని పూర్తిగా నిషేధించడం ఆచరణ సాధ్యం కాదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అనూప్ బంబానీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌పై ఈ వ్యాఖ్యలను చేసింది. స్మార్ట్ ఫోన్లను స్కూల్‌కు తీసుకు రావడం, వాటిని విని యోగించడం అనేది ఒక అలవాటుగా మారిందనీ, దానిని పూర్తిగా నిషేధించడం సాధ్యం కాదనీ పేర్కొంది. అయితే, కొన్ని పరిమితులు విధించవచ్చని పేర్కొంది. పాఠశాలల్లో సాంకేతిక పరమైన సౌకర్యాలను వినియోగించుకోవడం తప్పులేదనీ, వారి భవిష్యత్ రీత్యా వాటిని పూర్తిగా నిషేధించడం సాధ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యార్థుల మధ్య విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లితండ్రుల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు స్మార్ట్ ఫోన్ వినియోగం అవసరమేనని బెంచ్ స్పష్టం చేసింది. కేంద్రీయ విద్యాలయ (ద్వారక) విద్యార్థి ఒకరు కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ, స్మార్ట్ ఫోన్లను విద్యార్థులు దుర్వినియోగం చేస్తున్నారని, వాటిని పూర్తిగా నిషేధించాలని కోరారు. డిజిటల్ విద్య ద్వారా విద్యార్థులను బాధ్యతా యుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు వీలుందని బెంచ్ పేర్కొంది.

# కలకలం రేపిన సర్పంచ్ దారుణహత్య

## మహారాష్ట్ర సీఎం ఆదేశాలతో నైతిక బాధ్యతగా మంత్రి ముండే రాజీనామా



మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో సర్పంచ్ దారుణహత్య వ్యవహారం రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసులో ఆయనపై ఆరోపణలు రావడంతో మంత్రి పదవికి రాజీనామా చేయాలని ధనంజయ్ ముండేను సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆయన తన రాజీనామాను సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఫడణవీస్ మాట్లాడుతూ ముండే రాజీనామాను తాను ఆమోదించి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపానని మీడియాకు తెలిపారు. ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంలో కీలకనేత ధనంజయ్ ముండే సొంత జిల్లా బీడ్‌లోని మసాజోగ్ గ్రామ సర్పంచి సంతోష్ దేశముఖ్‌ను కిడ్నాప్ చేసి ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి చంపిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ హత్యోదంతానికి సంబంధించిన కేసులో మంత్రి సన్నిహితుడు వాల్మిక్ కరాడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు, మంత్రి ధనంజయ్ ముండేకు గట్టి మద్దతు ఇస్తున్న ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు, మంత్రికి వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను తాను సమర్పించినట్లు సామాజిక కార్యకర్త అంజలి దమానియా పేర్కొనడంతో మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్లు మళ్లీ మొదలయ్యాయి. ఎన్సీపీ (శరద్ పవార్) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే సైతం ధనంజయ్ ముండే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ధనంజయ్ మాట్లాడుతూ తనను మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్ లేదా డిప్యూటీ సీఎం అజిత్ పవార్ చెప్తే వెంటనే రాజీనామా చేస్తానన్నారు.

# ప్రజారోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం

## ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహిస్తున్నాయని సుప్రీం ఆగ్రహం - కల్పించుకోవాలని కేంద్రానికి ఆదేశాలు

దిల్లీ: అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ప్రైవేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారిందని వ్యాఖ్యానించింది. ప్రైవేటు ఆస్పత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో కూడిన మందులను కొనుగోలు చేయిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్పై తాజాగా సుప్రీంలో విచారణ జరిగింది. తమ ఫార్మసీల నుంచే ఔషధాలు కొనుగోలు చేయాలని రోగులను బలవంతం చేయకుండా ప్రైవేటు ఆసుపత్రులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దానివల్ల రోగులు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. పిటిషనర్ వాదనతో సుప్రీం ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే చోట తక్కువ ధరకు లభిస్తున్నప్పుడు, దానిని తమ ఫార్మసీలోనే కొనుగోలు చేయాలని ప్రైవేటు ఆసుపత్రులు బలవంతం చేయకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార ఔషధాలు అందుబాటు ధరల్లో లభించడం కష్టమైపోయిందని వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడీకీ గురికాకుండా రక్షించేందుకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.



ఇదే విషయమై గతంలో సుప్రీంకోర్టు రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చింది. వాటికి ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. కౌంటర్ అఫిడవి దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ధరల నియంత్రణ ఆదేశాలపైనే తాము ఆధారపడతామని పేర్కొన్నాయి. అత్యవసర ఔషధాలు అందుబాటు రేటులో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలను నిర్ణయించినట్లు తెలిపాయి. ఆసుపత్రిలోని ఫార్మసీలోని మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏదీ లేదని కేంద్రం, కోర్టుకు సమాధానమిచ్చాయి.

### పది రూపాయల కోసం..

# కన్న తండ్రిని నరికి చంపిన కసాయి కొడుకు



కేవలం పది రూపాయల కోసం కన్న తండ్రినే దారుణంగా నరికి చంపాడో వ్యక్తి. అనంతరం తండ్రి తలను తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. ఈ దారుణం ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లాలో చోటుచేసుకుంది. గుట్కా కొనుక్కునేందుకు తండ్రి బైధార్సింగ్ (70)ని డబ్బులు అడగ్గా నిరాకరించడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన నిందితుడు (40) పదునైన ఆయుధంతో తండ్రిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన అతడి తల్లి అక్కడి నుంచి పారిపోయింది. ఈ విషయంలో నిందితుడు, అతడి తల్లిదండ్రుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుందని.. మాటామాటా పెరిగి చివరకు ఈ దారుణానికి దారితీసినట్లు పోలీసులు వివరించారు. ఒక చిన్న విషయానికే ఈ హత్య జరిగిందని తెలిపారు. ఘటన జరిగిన గ్రామానికి ఫోరెన్సిక్ బృందం వెళ్లిందని, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

# ఇక యుద్ధ విమానాల తయారీలో ప్రైవేట్ రంగం

## రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నిపుణుల కమిటీ నివేదిక



భారత్ యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేటు రంగం కూడా అడుగు పెట్టేందుకు మార్గం మరింత సుగమమయింది. తాజాగా దీనికి సంబంధించి డిఫెన్స్ ఎంపవర్మెంట్ కమిటీ ఈ మేరకు సూచన చేసింది. తేలికపాటి యుద్ధవిమానాలు తేజస్ ఉత్పత్తి వేగవంతం చేసేందుకు నిపుణులతో కూడిన ఐదుగురు సభ్యుల కమిటీని ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. అధ్యయనం చేసిన కమిటీ తాజాగా రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. కాగా కమిటీకి రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ అధ్యక్షత వహించారు.

# భారత ప్రజాస్వామ్యంపై వోల్కర్ టర్క్ వక్రభాష్యం

## భారత ప్రతినిధి ఆరిందమ్ బాగ్చీ ఖండన

ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ భారత్‌లోని మణిపూర్, కశ్మీర్ సమస్యలను ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిని భారత్ తరపు ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తిప్పికొట్టారు. తమపై చేస్తున్న విమర్శల్లో నిజం లేదని ఇప్పటికే నిరూపితమైందని స్పష్టం చేశారు. జెనీవాలో జరిగిన 58వ మానవ హక్కుల మండలిలో గ్లోబల్ అప్డేట్స్‌పై టర్క్ మాట్లాడారు. 'మణిపూర్లో హింస, శాంతిస్థాపన వంటి పలు సమస్యలు పరిష్కరించడానికి వేగవంతంగా చర్చలు జరపాలని కోరుతున్నానని టర్క్ పేర్కొన్నారు. కశ్మీర్ సహా పలు ప్రాంతాల్లో మానవహక్కుల పరిరక్షకులు, స్వతంత్ర జర్నలిస్టులపై నిర్బంధ చట్టాలు విధించడం, పౌరులు తిరిగే ప్రాంతాలను వినియోగించుకోకుండా ఆంక్షలు పెట్టడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నానన్నారు. భారత దేశానికి ప్రజాస్వామ్యం, సంస్థలు అతిపెద్ద బలం. అవి ఆ దేశ అభివృద్ధికి, వైవిధ్యానికి ఆధారం. ప్రజాస్వామ్యాన్ని సమాజంలోని అన్ని స్థాయిల్లోనూ పెంపొందించాల్సిన అవసరం ఉంది' అని టర్క్ పేర్కొన్నారు. దీనిపై అరిందమ్ బాగ్చీ స్పందిస్తూ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం, శక్తివంతమైన దేశమని పేర్కొన్నారు. గ్లోబల్ అప్డేట్లో టర్క్ పేర్కొన్న నిరాధారమైన వ్యాఖ్యలు క్షేత్రస్థాయిలో విరుద్ధంగా ఉన్నాయన్నారు. భారత్‌పై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని దేశ ప్రజలు ఇప్పటికే నిరూపించారని స్పష్టం చేశారు. గ్లోబల్ అప్డేట్లో ఇలాంటి తప్పుడు సమాచారం ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇతరులు చేసే వ్యాఖ్యలనే చెప్పాలనేలా టర్క్ తీరు ఉందని బాగ్చీ ఆక్షేపించారు.



# చైనాకు అమెరికా గట్టి షాక్

## సుంకాలతో విరుచుకుపడుతున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్..

సుంకాల విషయంలో చైనాకు గట్టి షాకిచ్చారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి రాగానే మిత్ర దేశాలైన మెక్సికో, కెనడాలతోపాటు తాజాగా చైనాపై కూడా సుంకాల కొరడా ఝుళిపించారు. ఇప్పటికే ఆ దేశ ఉత్పత్తులపై 10 శాతం సుంకాలు విధించగా, తాజాగా దాన్ని 20శాతానికి పెంచుతూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఫెంటనిల్ డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో బీజింగ్ విఫలమవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ తెలిపారు.



**కెనడా, మెక్సికోకు లభించని ఊరట**

మరోవైపు కెనడా, మెక్సికో దిగుమతులపై 25% సుంకాల విషయంలో ఎలాంటి మార్పు లేదని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. మార్చి 4 (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి అవి యథావిధిగా పెంచిన సుంకాలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచే ఇవి అమల్లోకి వస్తాయని గతంలో ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్, కెనడా ప్రధాని ట్రూడో అమెరికా అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడారు. సరిహద్దు భద్రతకు సైన్యాన్ని మోహరిస్తామని, వ్యవస్థీకృత నేరాలు, మనీలాండరింగ్, ఫెంటనిల్‌పై పోరాటానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ కూడా ఇచ్చారు. దీంతో సుంకాల అమలును నెల రోజుల పాటు వాయిదా వేసేందుకు ట్రంప్ అప్పట్లో అంగీకారం తెలిపారు. ఆ గడువు నేటితో ముగియనుంది. దీనితో మెక్సికో, కెనడాపై సుంకాలు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ వెల్లడించారు. ఇక ఆ దేశాలకు ఎలాంటి అవకాశాలు మిగిలి లేవని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి చైనాపై విధించిన సుంకాలు గత నెల నుంచే అమల్లోకి రాగా, తాజాగా వాటిని రెట్టింపు చేశారు ట్రంప్.

ట్రంప్ టారిఫ్ వార్ ప్రారంభించిన నేపథ్యంలో చైనా కూడా దీటుగా స్పందించింది. అమెరికాకు చెందిన వ్యవసాయ ఉత్పత్తులపై 15శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తామని ప్రకటించింది. ముఖ్యంగా అమెరికా నుంచి తమ దేశంలోకి దిగుమతి అయ్యే చికెన్, గోధుమ, పత్తి, కార్న్‌పై అదనంగా 15 శాతం సుంకాలు విధిస్తామని చైనా వాణిజ్య శాఖ తెలిపింది. సోయా, పోర్క్, బీఫ్, సముద్ర ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, డైరీ ఉత్పత్తులపై ప్రస్తుతమున్న సుంకాలను 10 శాతం మేర పెంచుతామని పేర్కొంది. నూతన సుంకాలు మార్చి 10 నుంచి అమల్లోకి వస్తాయని చైనా వాణిజ్య శాఖ వెల్లడించింది. అంతేకాదు అమెరికాకు చెందిన 10 రక్షణ రంగ సంస్థలను డ్రాగన్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఫలితంగా అమెరికా సంస్థలు చైనాలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉండదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఆ సంస్థలకు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా చైనాలోకి ప్రవేశించేందుకు అవకాశం ఉండదని తెలిపింది.


**కెనడా ప్రతీకార సుంకాలు**

కెనడా నుంచి దిగుమతి చేసుకునే పలు ఉత్పత్తులపై 25శాతం, చమురు, సహజవాయువు, విద్యుత్తుపై మాత్రం 10% సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. దీనికి ప్రతిగా ట్రూడో కూడా అగ్రరాజ్యంపై సుంకాలు విధించారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఆల్కహాల్, పండ్లు సహా 107 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై తాము కూడా 25% సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. ఇవి కూడా మంగళవారం నుంచే అమల్లోకి వస్తున్నట్లు తెలిపారు.

**మార్కెట్లపై ఎఫెక్ట్**

ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు అమెరికా మార్కెట్లు కుదేలయ్యాయి. సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) నాటి ట్రేడింగ్‌లో సూచీలు పతనమయ్యాయి. డోజోన్స్ 1.48శాతం, ఎస్అండ్‌పీ సూచీ 1.76శాతం, నాస్‌డాక్ 2.64శాతం మేర నష్టపోయాయి. ఈ ప్రభావం ఆసియా-పసిఫిక్, ఆస్ట్రేలియా మార్కెట్లపైనా పడింది.

## ఈయూతో సంబంధాలు పెంచేందుకు చైనా ప్రయత్నం



ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే విషయంలో అమెరికా, ఐరోపా సమాఖ్య మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఇదే అదనుగా భావించిన చైనా.. ఈయూతో తన సంబంధాలను మరింత పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అగ్రరాజ్యం తీసుకుంటున్న ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా ఈయూతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా పార్లమెంటు ప్రతినిధి లౌ కిన్జియాన్ మంగళవారం పేర్కొన్నారు.

"గత 50 ఏళ్లుగా చైనా, యూరప్ మధ్య ఎటువంటి ఘర్షణలు లేవు. ఇరు వర్గాలు అనేక అంశాల్లో భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. చైనా ఉత్పత్తులకు, ఇక్కడ రూపొందించే ఏఐ అనుకూల ఇ-వాహనాల బ్యాటరీలకు ఈయూ దేశాలు లాభదాయకమైన మార్కెట్‌గా ఉన్నాయి. కాబట్టి ఆ దేశాలతో సంబంధాలు మరింత పెంచుకోవడానికి ఆసక్తితో ఉన్నాం" అని లౌ కిన్జియాన్ పేర్కొన్నారు. చైనా-యూరప్ సంబంధాలు ఏ మూడో పక్షాన్ని లక్ష్యంగా చేసుకోవని.. వాటిపై ఆధారపడి ఉండవని పరోక్షంగా అమెరికా ఐరోపా దేశాల సంబంధాలను ఉద్దేశించి అన్నారు.

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మీడియా ఎదుటే తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలను చైనా ప్రభుత్వం ఆధ్వర్యంలోని మీడియా సంస్థలు విపరీతంగా ప్రసారం చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో ట్రంప్-పుతిన్ మధ్య సయోధ్య పెరుగుతుండడం పట్ల బీజింగ్ ఆందోళన చెందుతున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. వాషింగ్టన్తో మాస్కో జరుపుతున్న చర్చల గురించి జిన్పింగ్కు వివరించడానికి పుతిన్ తన ఉన్నత భద్రతా అధికారి సెర్గీ షోయిగును బీజింగ్‌కు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చైనా ఈయూ దేశాలతో సంబంధాలపై ప్రకటన చేయడం గమనార్హం.

## ఇంకా కోమాలోనే భారత విద్యార్థిని నీలమ్ షిండే



అమెరికాలో రోడ్డు ప్రమాదానికి గురై కోమాలో ఉన్న భారతీయ విద్యార్థి నీలమ్ షిండే తల్లిదండ్రులు యూఎస్ చేరుకున్నారు. గత వారం వారికి ఎమర్జెన్సీ వీసా మంజూరైన విషయం తెలిసిందే. వెంటనే వారు యూఎస్ బయల్దేరి వెళ్లారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నీలమ్ షిండే వద్దకు వెళ్లారు. ఆసుపత్రి అధికారులను కలిసి నీలమ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. నీలమ్ ఇప్పటికీ కోమాలోనే ఉన్నట్లు చెప్పారు. అయితే, కాస్త మెరుగుదల కనిపిస్తోందని.. మెదడుపై ఒత్తిడి తగ్గినట్లు చెప్పారు. ఆమెకు శస్త్రచికిత్స కూడా విజయవంతమైనట్లు నీలమ్ మామ సంజయ్ కదమ్ మీడియాకు తెలిపారు.

అమెరికాలోని ఒక యూనివర్సిటీలో చదువుతున్న మహారాష్ట్ర సితార జిల్లాకు చెందిన నీలమ్ షిండే (35) ఈనెల 14న కాలిఫోర్నియాలో ఫోర్ వీలర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నది. ప్రస్తుతం విద్యార్థిని కోమాలో ఉంది. ఆమెకు బ్రెయిన్ సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. దీంతో కుమార్తెను చూసేందుకు వీసా కోసం తల్లిదండ్రులు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, వారికి వీసా మంజూరు కాలేదు. దీంతో లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలే జోక్యం చేసుకొని.. నీలమ్ షిండే చావుబతుకుల్లో ఉందని ఆమెను చూసేందుకు తల్లిదండ్రులకు అత్యవసర వీసా మంజూరు అయ్యేలా చూడాలని కేంద్ర విదేశాంగ శాఖను కోరారు.

ఆమె విజ్ఞప్తితో జోక్యం చేసుకున్న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. బాధిత కుటుంబానికి యూఎస్ వీసా అపాయింట్‌మెంట్ ఇంటర్వ్యూ స్లాట్‌ను వేగవంతం చేసింది. వారి అభ్యర్థనకు స్పందించిన అమెరికా.. గత నెల 28న ముంబైలోని యూఎస్ కాన్సులేట్‌లో వారిని ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా వారికి అత్యవసర వీసాను యూఎస్ రాయబార కార్యాలయం అధికారులు మంజూరు చేశారు. దీంతో అదేరోజు నీలమ్ కుటుంబం యూఎస్ బయల్దేరి వెళ్లింది.

## సెర్బియా పార్లమెంట్‌లో స్మోక్ బాంబులు

*- ముగ్గురు ఎంపీలకు గాయాలు*



సెర్బియా పార్లమెంటు అట్టుడికింది. ప్రతిపక్షాల నిరసన తో గందరగోళం ఏర్పడింది. స్మోక్ బాంబులు, కోడిగుడ్లు, వాటర్ బాటిళ్లనూ చట్టసభ సభ్యులు విసురుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలో ముగ్గురు ఎంపీలకు గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. యూనివర్సిటీ విద్యకు నిధులు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగింది. దీనిపై ఓటింగ్ సమయంలో పార్లమెంటులో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అధికార పార్టీ అనేక నిర్ణయాలను ఆమోదించే యోచనలో ఉందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు నిరసన చేపట్టాయి. ఇది చట్టవిరుద్ధమని, ప్రధాని మిలోస్ వుచెవిక్ రాజీనామాను వెంటనే ఆమోదించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. బ్యానర్లు చేతపట్టి, నినాదాలు చేస్తూ విపక్ష సభ్యులు నిరసనలకు దిగారు.

ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన స్పీకర్ అనా బ్రనాబిక్.. ప్రతి పక్షాలను ఉగ్రవాద ముఠాలుగా పేర్కొన్నారు. మరోవైపు, సెర్బియాలోని ఉత్తరప్రాంతంలో ఓ బిల్డింగ్ కూలి 15 మంది చనిపోయారు. విద్యార్థులు చేపట్టిన అవినీతి నిర్మూలన ఉద్యమం తీవ్రరూపం దాల్చడంతో ప్రధానమంత్రి మిలోస్ వుచెవిచ్ ఇటీవలే రాజీనామా చేశారు. పార్లమెంటు దీన్ని ఆమోదించాల్సి ఉంది. కొత్త చట్టం అమల్లోకి రావాలంటే పార్లమెంట్ ప్రధానమంత్రి రాజీనామాను ధృవీకరించాలి. కొత్త చట్టాలను ఆమోదించే అధికారం ప్రభుత్వానికి లేదని ప్రతిపక్ష పార్టీలు పట్టుబడుతున్నాయి. మరోవైపు విద్యార్థులు చేపట్టిన అవినీతి నిర్మూలన ఉద్యమానికి మేధావులు, న్యాయమూర్తులు, రైతులు, న్యాయవాదులు, నటులు సహా అనేక రంగాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

## ట్రంప్ హెచ్చరిక..

**నిరసనలు చేస్తే నిధులు ఆపేస్తా - జైలుశిక్ష లేదా బహిష్కరణ**



స్వదేశంలో ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల పెంపుతో దూకుడుగా వ్యవహరిస్తున్న అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక ప్రకటన చేశారు. చట్టవిరుద్ధ నిరసనలను అనుమతించే కాలేజీలు, స్కూళ్లు, యూనివర్సిటీలకు కేంద్రం నిధులను నిలిపివేస్తానని ట్రంప్ హెచ్చరించారు. అంతేకాకుండా ఆందోళనకారులకు జైలుశిక్ష లేదా బహిష్కరణ తప్పదన్నారు. అమెరికా విద్యార్థులైతే తీవ్రతను బట్టి అరెస్టు వంటి చర్యలుంటాయని స్పష్టం చేశారు.

"చట్టవిరుద్ధ నిరసనలను అనుమతించే కాలేజీ, స్కూల్ లేదా యూనివర్సిటీలకు అన్ని ఫెడరల్ నిధులు నిలిపివేస్తా. ఆందోళనకారులను జైలుకో లేదా వారి స్వదేశానికి పంపించడం జరుగుతుంది. అమెరికా విద్యార్థులైతే శాశ్వత బహిష్కరణ లేదా కేసు తీవ్రతను బట్టి అరెస్టు ఉంటుంది. ఇందులో ఎటువంటి దాపరికం లేదు. ఈ విషయంపై దృష్టి పెట్టినందుకు ధన్యవాదాలు" అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్ పేర్కొన్నారు. అమెరికా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. విద్యాశాఖను తొలగించి, దానిని రాష్ట్రాలకు అప్పగిస్తానని చెప్పారు. ఈ క్రమంలో అమ్మాయిల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిషేధించిన ఆయన.. లింగ, జాతి వివక్ష గురించి బోధించే కాలేజీలకు నిధుల్లో కోత విధిస్తానని గతంలో హెచ్చరించారు. అయితే, గాజాలో యుద్ధానికి వ్యతిరేకంగా ఇటీవల కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు నిరసనలు చేపట్టడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వీటిని నిలువరించడంలో విఫలమైన యూనివర్సిటీకి 50 మిలియన్ డాలర్ల కాంట్రాక్టులను రద్దు చేసే యోచనలో ట్రంప్ యంత్రాంగం ఉన్నట్లు సమాచారం.

చైతన్యరథం




## భారత జట్టుకు చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్య రథం): అద్భుత విజయం సాధించిన భారత క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. భారత్-ఆస్ట్రేలియాల మధ్య మ్యాచ్ ముగిసిన వెంటనే ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ-ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయం సాధించిన టీం ఇండియాకు అభినందనలు. ఫైనల్ మ్యాచ్‌కు జట్టుకు శుభాకాంక్షలు' అంటూ పోస్టు చేశారు.









### కోహ్లి క్లాస్.. హార్దిక్ ఊర మాస్..

# ఫైనల్‌కు టీమిండియా!

- ఆసీస్‌ను కంగారెత్తించిన భారత్
- సెమీస్‌లో ఘన విజయం
- కలిసి కట్టుగా .. కదంతొక్కిన టీమిండియా





ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. ఓటమెరుగని జట్టుగా రోహిత్ సేన ఫైనల్ చేరింది. ఆస్ట్రేలియాతో దుబాయ్ వేదికగా మంగళవారం జరిగిన సెమీఫైనల్లో టీమిండియా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరోసారి విరాట్ కోహ్లీ అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఆసీస్ చేతిలో ఎదురైన పరాజయానికి టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్(96 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 73), అలెక్స్ క్యారీ(57 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో మహమ్మద్ షమీ(3/48) మూడు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి(2/49), రవీంద్ర జడేజా(2/40) రెండేసి వికెట్లు పడగొట్టారు.

అనంతరం లక్ష్యఛేధనకు దిగిన భారత్ 48.1 ఓవర్లలో 267 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ(98 బంతుల్లో 5 ఫోర్లతో 84) సెంచరీ చేజార్చుకోగా.. శ్రేయస్ అయ్యర్(62 బంతుల్లో 3 ఫోర్లతో 45), కేఎల్ రాహుల్(34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42), హార్దిక్ పాండ్యా(24 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 28) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్, ఆడమ్ జంపా రెండేసి వికెట్లు తీయగా.. బెన్, కూపర్ తలో వికెట్ పడగొట్టారు.

లక్ష్యచేధనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్(8)మరోసారి తీవ్రంగా నిరాశపరిచాడు. బెన్ ద్వార్షుయిస్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దూకుడుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టిన రోహిత్ శర్మ.. రెండు లైఫ్స్ వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. కూపర్ కొన్నోల్లీ.. రోహిత్ శర్మ(28)ను వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. రివ్యూ తీసుకున్నా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్, కోహ్లీ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. దాంతో పవర్ ప్లేలో భారత్ 2 వికెట్లకు 55 పరుగులు చేసింది.

**ఆదుకున్న కోహ్లీ-అయ్యర్..**

అనంతరం ఇదే జోరు కనబర్చిన ఈ జోడీ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. క్విక్ సింగిల్స్, డబుల్స్‌తో వేగంగా పరుగులు చేసింది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ 53 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు అయ్యర్ అనవసర షాట్‌తో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఆడమ్ జంపా బౌలింగ్‌లో కట్ షాట్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 91 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్‌తో కోహ్లీ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కోహ్లీ తనదైన స్టైల్‌లో పరుగులు చేయగా.. అక్షర్ పటేల్‌లో భారీ షాట్లు ఆడే ప్రయత్నం చేశాడు. అయితే అతన్ని నాథన్ ఎలిస్ క్లీన్ బౌల్డ్ చేయడంతో 4వ వికెట్‌కు నమోదైన 44 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

**హార్దిక్ పాండ్యా విధ్వంసం..**

బ్యాటింగ్‌కు వచ్చిన కేఎల్ రాహుల్‌తో కోహ్లీ ఆచితూచి ఆడాడు. ఇద్దరూ నెమ్మదిగా ఆడటంతో 39 బంతుల వరకు బౌండరీ రాలేదు. ఆ తర్వాత రాహుల్ అద్భుతమైన షాట్లతో చెలరేగి ఒత్తిడిని తగ్గించాడు. అయితే భారీ షాట్ ఆడే ప్రయత్నంలో కోహ్లీ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగి సెంచరీ చేజార్చుకున్నాడు. దాంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. హార్దిక్ పాండ్యా తనదైన శైలిలో 3 భారీ సిక్స్‌లు బాది టీమిండియాపై ఒత్తిడి తగ్గించాడు. విజయం ముంగిట హార్దిక్ పాండ్యా.. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔటయ్యాడు. జడేజా సాయంతో కేఎల్ రాహుల్ భారీ సిక్సర్‌తో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

**సెంచరీ కంటే గెలుపు ముఖ్యం: విరాట్ కోహ్లీ**

ఈ గేమ్ మొత్తం ఒత్తిడికి సంబంధించినది. మ్యాచ్‌ను మరింత డీప్‌గా తీసుకెళ్తే ప్రత్యర్థి మరింత ఒత్తిడి తెస్తోంది. కాబట్టి మనల్ని మనం నియంత్రించుకోవడం చాలా ముఖ్యం. చేయాల్సిన పరుగులు సగటు 6 ఉన్నా.. నేను భయపడేవాడిని కాదు. ఇది నా అత్యుత్తమ ప్రదర్శన అని నేను చెప్పలేను. నేనెప్పుడూ ఇలాంటి విషయాలపై ఫోకస్ పెట్టను. మైలురాళ్ల గురించి పట్టించుకోకుంటేనే అవి దక్కుతాయి. నేను సెంచరీ చేస్తే గొప్పగా ఫీలయ్యేవాడిని. కానీ సెంచరీ కంటే నాకు జట్టు విజయం ముఖ్యం. సెంచరీ మిస్సైందనే బాధ ఏ మాత్రం లేదు'అని విరాట్ కోహ్లీ తెలిపాడు.



## క్రిస్ గేల్ ఆల్‌టైమ్ రికార్డ్ బద్దలు చేసిన రోహిత్ శర్మ..

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ వన్డే టోర్నీల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను యూనివర్సల్ బాస్, వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన సెమీఫైనల్లో రోహిత్ శర్మ ఈ ఫీట్ సాధించాడు.

ఈ మ్యాచ్‌లో నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా రోహిత్ శర్మ అద్భుతమైన సిక్సర్ బాదాడు. ఐసీసీ వన్డే టోర్నీల్లో రోహిత్ శర్మకు ఇది 65వ సిక్స్. దాంతో క్రిస్ గేల్ పేరిట ఉన్న 64 సిక్స్‌ల రికార్డ్‌ను రోహిత్ అధిగమించాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ(65), క్రిస్ గేల్(64) తర్వాత గ్లేన్ మ్యాక్స్‌వెల్(49), డేవిడ్ మిల్లర్(45), డేవిడ్ వార్నర్(42), సౌరవ్ గంగూలీ(42) ఉన్నారు.

ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్‌గా 250 సిక్స్‌లు బాదిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ రికార్డ్ సాధించాడు. అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన టాప్-10 బ్యాటర్ల జాబితాలో రాహుల్ ద్రవిడ్(10,889)ను రోహిత్ శర్మ అధిగమించాడు. ఇప్పటికే వన్డేల్లో క్రిస్ గేల్ 331 సిక్స్‌ల రికార్డ్‌ను అధిగమించిన రోహిత్(338).. అఫ్రిది 351 సిక్స్‌ల రికార్డ్‌ను అధిగమించే దిశగా సాగుతున్నాడు.

చైతన్య రథం సినిమా
బుధవారం 5 మార్చి 2025


# ఆ 'మాయ'ను మర్చిపోలేను!



'ఏమాయ చేసావె' చిత్రంతో వెండితెరకు పరిచయమైన సమంత వరుస చిత్రాలతో తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించారు. అగ్ర కథానాయికగా రాణించడమే కాదు, వెబ్ సిరీస్‌లలోనూ నటిస్తూ తన వైవిధ్యతను చాటుతున్నారు. ఇండస్ట్రీకి పరిచయమై పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామ్ కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"15 సంవత్సరాలు అనేది చాలా ఎక్కువ సమయమే. కొన్ని విషయాలు ఇప్పటికీ మర్చిపోలేను. మరికొన్ని పెద్దగా గుర్తులేవు. తొలినాళ్లలో నేను నటించిన సినిమాలను ఇప్పుడు చూస్తే, చాలా చెత్తగా నటించానని అనిపిస్తుంది. అయితే, వాటినుంచే పాఠాలు నేర్చుకున్నా. నాకు మార్గదర్శకులు లేరు. కనీసం నాకు భాష కూడా రాదు. ఇండస్ట్రీలో స్నేహితులు, బంధువులు కూడా లేరు. అప్పుడు నాకన్నీ కొత్తే"

"ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో గ్లామర్ పాత్రలు చేయడానికి చాలా కష్టంగా అనిపించేది. వాటిల్లో పరకాయ ప్రవేశం చేయడానికి ప్రయత్నించేదాన్ని. ఆ పాత్రలు నిజ జీవితంలో ఎలా ఉంటాయో అర్థం చేసుకుని, వాటిని ఆకళింపు చేసుకునేదాన్ని. వాటిలా ప్రవర్తించడం, డ్యాన్స్ చేయడం చేసేదాన్ని. ఇప్పుడు మళ్లీ ఆ సన్నివేశాలను చూస్తుంటే, నవ్వొస్తుంది"

"నా మొదటి చిత్రం 'మాస్కో కావేరి'. నా స్నేహితుడు రాహుల్ రవీంద్రన్‌తో కలిసి చేశా. అయితే, ఇప్పుడది అంతగా గుర్తులేదు. ఎందుకంటే, అది కేవలం ఒక రోజు మాత్రమే షూట్ చేశాం. తర్వాత చిత్రీకరణ ఆగిపోయింది. మళ్లీ కొన్ని రోజులకు మొదలైంది. 'ఏమాయ చేసావె' చాలా ప్రత్యేకమైంది. నాకు ప్రతి షాట్ గుర్తుంది. కర్తీక్‌ను గేటు దగ్గర కలిసే సీన్ నా ఫస్ట్ షాట్. ఆ సినిమాకు సంబంధించి ప్రతి డీటెయిల్ నాకు ఇప్పటికీ గుర్తుంది. ఎందుకంటే దర్శకుడు గౌతమ్ మేనన్‌తో పనిచేయడం అద్భుతమైన అనుభూతి. పాత్రలను ఎలా తీర్చిదిద్దాలో ఆయనకు బాగా తెలుసు. తర్వాత ఆ స్థాయిలో సంతృప్తి ఇచ్చి పాత్రలు చాలా తక్కువ" అన్నారు.

# ఇండస్ట్రీని మార్చేయాలనుకున్నా..



ఏ రంగంలోనైనా అడుగుపెట్టిన కొత్తలో ఆ ఇండస్ట్రీ రూపు రేఖలే మార్చేయాలని చాలామంది అనుకుంటుంటారు. అప్పటికే పని చేస్తున్న వారికంటే తామే ప్రతిభావంతులమని ఫీలవుతారు. కొంత అనుభవం వచ్చిన అనంతరం వాస్తవాన్ని గ్రహిస్తారు. చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కొత్తలో తానూ ఇలాంటి ఆలోచనలతోనే ఉన్నట్టు ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెలిపారు. అక్కినేని అమలతో కలిసి పాల్గొన్న ఓ కార్యక్రమంలో కెరీర్ ప్రారంభరోజులు గుర్తుచేసుకున్నారు. "సినిమా చూడడం తేలికైన వ్యవహారం. కానీ, తెరకెక్కించడం కష్టం. నా విషయానికొస్తే.. 2014లో నేను తీసిన తొలి చిత్రం 'ఉగ్రం'. దాని షూటింగ్ ప్రారంభంకాక ముందు.. 'ఇప్పటి వరకూ సినిమాలు తెరకెక్కించిన వారంతా బ్యాడ్ డైరెక్టర్స్ (నవ్వుతూ), ఇండస్ట్రీలో మనమే మార్పు తీసుకురావాలి' అనుకునేవాడిని. కానీ, మూవీ మేకింగ్ ఎంత కష్టమో కొంత భాగం చిత్రీకరణ పూర్తయ్యాక అర్థమైంది. ఈ సినిమా 10మంది చూసినా చాలనిపించింది. ఫిల్మ్ మేకింగ్ టెన్నిస్ లాంటిది కాదు, క్రికెట్లాంటిది. బృందంతో కలిసి పని చేయాలి. టీమ్ వర్క్ ఉంటేనే మంచి విజయం అందుకుంటామనే విషయాన్ని త్వరగానే గ్రహించా" అన్నారు.

# అందమైన స్మగ్లింగ్



ఇదేమీ సినిమా సీన్ కాదు. బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ రియల్‌గానే నటి దొరికిపోయారు. బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చారనే కారణంతో కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టయ్యారు. దుబాయ్ నుంచి ఆమె తీసుకొచ్చిన దాదాపు 15 కేజీల బంగారాన్ని బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాన్యా ఇటీవల తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండడంతో ఆమెపై నిఘా పెట్టారు. గత 15 రోజుల్లో నాలుగుసార్లు దుబాయ్ వెళ్లొచ్చిన రాన్యా.. ఎలాంటి అనుమానం రాకుండా గోల్డ్ బిస్కెట్లను దుస్తుల్లో దాచి తీసుకొచ్చేవారని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ప్రణాళిక ప్రకారం తాజాగా ఆమెను అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన ఓ పోలీసు అధికారికి రాన్యా బంధువని సమాచారం. డీఆర్ఐ అధికారులు ప్రశ్నించగా.. తాను డీజీపీ కుమార్తెనని చెప్పి.. ఇంటి వద్ద డ్రాప్ చేసేందుకుగానూ ఆమె పోలీసులకు కాల్ చేసినట్టు తెలిసింది. అసలు పోలీసు అధికారులతో రాన్యాకు సంబంధమేంటి? ఆ స్మగ్లింగ్‌లో వారి ప్రమేయమేమైనా ఉందా? అన్న కోణంలో డీఆర్ఐ అధికారులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు. కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మాణిక్య' చిత్రంతో తెరంగేట్రం చేశారు రాన్యారావ్.ఆతర్వాత 'వాఘా', 'పటాకీ' సినిమాల్లో నటించారు.



## ఒక్క గ్లింప్స్‌తో షేక్ చేశాడు..

'దసరా' సినిమా చేసిన దగ్గర్నుంచీ నాని 2.0 మొదలైందన్న టాక్ తెచ్చుకున్నాడు నేచురల్ స్టార్ నాని. 2.0 వర్షన్‌లో వినూత్న సినిమాలు, అంతకుమించిన మేకోవర్స్‌తో ఊహించని ట్రీట్ ఇస్తున్నాడు నేచరల్ స్టార్. అయితే రీసెంట్‌గా వచ్చిన హిట్–3 అనుకుంటే..ఇపుడు 'ది ప్యారడైజ్'తో సంచలనమే సెట్ చేసాడని చెప్పాలి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఊహించని మేకోవర్.. అలాగే ఊహించని డైలాగ్స్‌తో 'ది ప్యారడైజ్' గ్లింప్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంది. ఇది కడుపుమండిన కాకుల కథ అంటూ –మూవీ లవర్స్ మొత్తాన్ని గ్లింప్స్‌కి కట్టేశారు నానీ విత్ ఓదెల. పాజిటివో నెగిటివో.. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' గ్లింప్స్ మాత్రం సోషల్ మీడియాని ఓ రేంజ్‌లో షేక్ చేస్తుంది. మరి సినిమా కూడా ఇదే రేంజ్‌లో ఉంటే భారీ వసూళ్లు ఖాయమన్న లెక్కలు లేకపోలేదు. ఇక చిత్రానికి అనిరుధ్ సంగీతం సమకూరుస్తున్నాడు. ఎస్ఎల్‌వి సినిమాస్ ప్రాజెక్టును తెరకెక్కిస్తోంది.

# హీరో లేకుండా సినిమా చేస్తా



సందీప్ వంగా సినిమాలకు ప్రత్యేకమైన అభిమానులుంటారు. తొలి చిత్రంతోనే టాలీవుడ్, బాలీవుడ్‌లో తనకంటూ ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసుకున్నాడు సందీప్. సాధారణంగా సందీప్ సినిమాల్లో హీరోలకు ఎక్కువ ప్రాధాన్యముంటుందని కామెంట్స్ వినిపిస్తుంటాయి. 'యానిమల్'లో స్త్రీని తక్కువ చేసి చూపించారనీ కొందరు ప్రముఖులు అసహనం వ్యక్తంచేశారు. తాజాగా సందీప్ ఆసక్తికర కామెంట్స్ చేశారు, అసలు హీరో లేకుండా సినిమా తీస్తానని. ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్ తన సినిమాలపై వచ్చిన విమర్శల గురించి మాట్లాడుతున్న సమయంలో ఓ ప్రశ్న ఎదురైంది. 'మీరు పాటలు లేకుండా సినిమా తీస్తారా? లేదంటే హీరో లేకుండా తీస్తారా? రెండిటిలో ఒకదాన్ని ఎంచుకోండి' అని. దానికి సందీప్ వెంటనే 'హీరో లేకుండా సినిమా తీయాలనేది ఆలోచన. ఒకవేళ అలాంటి సినిమా తీస్తే.. నా చిత్రాలను విమర్శించిన మహిళలు దాన్నీ ఇష్టపడరు. కావాలంటే ఈ విషయాన్ని రాసిస్తాను. నాలుగైదేళ్లలో నేను హీరో లేకుండా సినిమా తీస్తాను. ఇప్పుడు విమర్శిస్తున్న వారంతా 'ఐదేళ్ల క్రితం సందీప్ చెప్పింది, చేసి చూపించాడు' అని మాట్లాడుకుంటారు" అని చెప్పారు.

ప్రస్తుతం సందీప్ వంగా ప్రభాస్ 'స్పిరిట్' పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా కలెక్షన్ల గురించి మాట్లాడుతూ.. దీని రికార్డులు బాహుబలిని దాటాలని లేదన్నారు. రూ.2000 కోట్లు అనేది చాలా పెద్ద విషయమన్నారు. ఇదైతే మంచి సినిమా అని చెప్పారు. ఎంత వసూళ్లు సాధిస్తుందనేది ప్రేక్షకుల చేతుల్లో ఉంటుందన్నారు.

# డేవిడ్ వార్నర్ కేమియో..?



నితిన్ 'రాబిన్‌హుడ్' మూవీపై ఆడియన్స్‌లో సాలిడ్ బజ్ క్రియేటైంది. సినిమాలో నితిన్ స్టైలిష్ లుక్‌ను ప్రజెంట్ చేయడంలో డైరెక్టర్ వెంకీ కుడుముల సక్సెస్ అయినట్టే కనిపిస్తోంది. ఈ కాంబోలో మూవీపై ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. దీనికితోడు మూవీనుంచి ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాలో స్పెషల్ కేమియోపై నిర్మాత రవిశంకర్ తాజాగా ప్రకటన చేశారు. 'రాబిన్‌హుడ్' సినిమాలో ప్రముఖ ఆస్ట్రేలియన్ మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కేమియో పాత్రలో కనిపిస్తాడని ప్రకటించారు. ఒకవిధంగా డేవిడ్ వార్నర్ ఇండియన్ సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నాడనే రవిశంకర్ చెప్తున్నారు. ఈ సినిమాలోని ఆయన పాత్ర ప్రేక్షకులను ఖచ్చితంగా ఆకట్టుకుంటుందన్నది నిర్మాత మాట. ఈ అనౌన్స్‌మెంట్‌తో ప్రేక్షకుల్లో, డేవిడ్ వార్నర్ అభిమానుల్లో సినిమాపై క్రేజ్ బలపడింది. యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా జివి ప్రకాష్‌కుమార్ సంగీతం సమకూరుస్తున్నాడు.

# రష్మికతో భారీ స్కెచ్!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం సౌత్‌తో పాటు నార్త్‌లోనూ ది మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారింది. భాషతో సంబంధం లేకుండా ఆమె చేస్తున్న ప్రతి ప్రాజెక్టు బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తోంది. ఆమెనుంచి 'యానిమల్', 'పుష్ప–2', 'ఛావా'ఇలా వరుసగా బ్లాక్‌బస్టర్ చిత్రాలు రావడంతో ప్రేక్షకుల్లో రష్మిక క్రేజ్ అమాంతం పెరిగింది. ఈ క్రేజ్‌ను నిర్మాతలు క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే రష్మికతో బాలీవుడ్ ప్రొడ్యూసర్స్ సినిమాలు చేసేందుకు క్యూ కడుతున్నారు. అయితే, బి–టౌన్ వర్గాల ప్రకారం బాలీవుడ్‌లోని ఓ స్టార్ ప్రొడ్యూసర్ రష్మికతో ఓ బిగ్ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నాడట. లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌గా సినిమాను భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేయాలని చూస్తున్నాడట. ఏకంగా రూ.100 కోట్ల బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేయాలని సదరు నిర్మాత ప్లాన్ చేస్తున్నాడని టాక్. అయితే, రష్మిక క్రేజ్ ప్రస్తుతం పీక్స్‌లో ఉన్నప్పటికీ, లేడీ ఓరియెంటెడ్ సినిమాపై ఇంతటి బడ్జెట్ పెట్టడం ఎంతవరకు కరెక్ట్ అన్నది పలువురి కామెంట్. నిజంగానే రష్మికతో సదరు బాలీవుడ్ నిర్మాత వంద కోట్ల భారీ స్కెచ్ వేస్తాడా లేదా? చూడాలి.